నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నింగిలోకి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ -సీ53

హైదరాబాద్, జూన్ 30:ఇస్రో విజయాశ్వంగా పిలువబడే పీఎస్ఎల్వీ సిరీస్‌లోని పీఎస్ఎల్వీ -సీ53 నింగిలోకి ఎగిరింది. శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) ఇందుకు వేదికగా నిలిచింది. నిన్న (బుధవారం) సాయంత్రం 4 గంటలకు షార్‌లో ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ ప్రక్రియను శాస్త్రవేత్తలు ప్రారంభించారు. 26 గంటల పాటు నిర్విరామంగా ఈ కౌంట్‌డౌన్ ప్రక్రియ కొనసాగింది. కౌంట్‌డౌన్ సమయంలోనే నాలుగు దశల రాకెట్లలో 4, 2 దశల మోటార్లలో ద్రవ ఇంధనాన్ని నింపారు. అనంతరం 1, 3 దశల మోటార్లకు ఘన ఇంధనాన్ని శాస్త్రవేత్తలు నింపారు. ప్రయోగానికి సుమారు 30 నిమిషాల ముందు రాకెట్‌ను సూపర్ కంప్యూటర్ ఆధీనంలోకి తీసుకెళ్లారు శాస్త్రవేత్తలు. సూపర్ కంప్యూటర్ ఆదేశాలతో కౌంట్‌డౌన్ 0కు చేరుకోగానే సాయంత్రం 6 గంటలకు నిప్పులు చిమ్ముతూ పీఎస్ఎల్వీ -సీ53 నింగిలోకి దూసుకెళ్లింది. పీఎస్ఎల్వీ సిరీస్ లో ఇది 55వ ప్రయోగం. సింగపూర్ శాటిలైట్స్ ను ఇస్రో కక్ష్యలోకి ప్రవేశపెడుతోంది.

హైదరాబాద్ శుక్రవారం 1-7-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 267 పేజీలు:6 వెల: రూ.1/-

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి మంత్రి అల్లోలకు ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 30:: జులై 5న జరిగే బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థాన నిర్వాహకులు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని ఆహ్వానించారు. గురువారం గచ్చిబౌలిలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

కాగా, జులై 4న ఎదుర్కోళ్లు, 5న అమ్మవారి కల్యాణం, 6న రథోత్సవం జరుగనున్నాయి. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ సాయిబాబా, ఆలయ ఈవో అన్నపూర్ణ, అర్చకులు, తదితరులున్నారు.

ఈ ఏడాది బోనాలకు రూ.17కోట్లు - కేసీఆర్ సర్కార్ నిర్ణయం

హైదరాబాద్, జూన్ 30:ఈ ఏడాది బోనాలకు రూ.17కోట్లని విడుదల చేసింది సీఎం కేసీఆర్ సర్కార్. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కాగా నేడు గోల్కొండ జగదాంబ అమ్మవారి బోనాలు ప్రారంభం కానుందని ప్రకటించారు తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. ఈ పూజలో భాగంగా అమ్మవారికి మొదటి నజర్ బోనం సమర్పించనున్నారు. నేడు లంగర్హౌస్ చౌరస్తా నుంచి భారీ ఊరేగింపుతో గోల్కొండ కోటకు నజర్ బోనం అలాగే తోటలను తీసుకువెళ్తారు. మధ్యాహ్నం ఒకటి గంటలకు ప్రారంభమయ్యే ఊరేగింపు రాత్రి 8 గంటల వరకు కోటపై ఉన్న అమ్మవారి ఆలయానికి చేరుకొనుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం తరఫున మధ్యాహ్నం 12 గంటలకు లంగర్ హౌస్ చౌరస్తాలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అలాగే ఇంద్రకరణ్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. జులై 5 న అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సారి అమ్మవారి కల్యాణానికి 5 లక్షల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నామని.. అమ్మవారి కల్యాణానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

బోనాలకు ప్రభుత్వం పెద్దపీట : హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, జూన్ 30:గోల్కొండ బోనాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని హోంమంత్రి మహ మూద్ అలీ అన్నారు. గోల్కొండ జగదాంబ మహంకాళి బోనాల ప్రారంభం సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బోనాలకు పెద్ద పీట వేశారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ప్రత్యేక బడ్జెట్ విడుదల చేసి వైభవంగా బోనాల పండుగ నిర్వహిస్తున్నామన్నారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయా నికి ప్రతీక బోనాలు అని అన్నారు. అందరం సంతోషంగా బోనాల పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మణిపూర్‌లో ఘోర ప్రమాదం.. కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతి

ఇంఫాల్, మణిపూర్‌లోని నోని జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. తుపుల్ యార్డ్ రైల్వే కన్‌స్ట్రక్షన్ క్యాంపుపై బుధవారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో జవాన్లు ఉన్నట్లు సమాచారం. రైల్వే లైన్ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద కాపలాగా జవాన్లు ఉన్నారు. కొండచరియల కింద 50 మందికి పైగా స్థానికులు, సైనికులు చిక్కుకున్నారు. శిథిలాలను తొలగించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అయితే కొండచరియలు విరిగిపడటంతో.. అక్కడున్న నది ప్రవాహం ఆగిపోయింది. దీంతో నోని జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నది వద్దకు పిల్లలను వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

మణిపూర్ సీఎం అత్యవసర సమావేశం

ఈ ప్రమాద ఘటనపై మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. తుపుల్‌లో ఇవాళ జరిగిన ప్రమాద ఘటనపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు బీరెన్ సింగ్ ప్రకటించారు. సహాయక చర్యలు అక్కడ కొనసాగుతున్నాయని తెలిపారు. ఘటనాస్థలికి అంబులెన్స్‌లతో పాటు వైద్యులను పంపాలని అధికారులను సీఎం ఆదేశించారు.

అమెరికాలో ఆటా మహాసభలకు ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూన్ 30:అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జూలై 1 నుంచి 3 వరకు జరిగే అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 17వ మహాసభల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొంటారు. మహాసభల్లో భాగంగా జరిగే యువజన సదస్సులో పాల్గొనాల్సిందిగా ఆటా ప్రతినిధులు ఆమెను ఆహ్వానించారు.

జూలై 2న జరిగే ఆటా మహాసభల్లో కవిత చేతుల మీదుగా తెలంగాణ పెవిలియన్ ప్రారంభమవుతుంది. అదేరోజు సాయంత్రం జరిగే ప్రధాన సమావేశంలో కవిత అతిథిగా పాల్గొంటారు. ఇదే సమావేశం వేదికగా బతుకమ్మ పండుగపై ఆటా ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆమె ఆవిష్కరిస్తారు. వేడుకల నిర్వహణకు 80 కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఆటా ప్రతినిధులు వెల్లడించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ఆశనివనరచనలలో
సాగించుచ కావ్యనివ సంస్కృతి జేటున
రాగాత్ముల మానసములు
సూగించెడి విదుని కొలకలూరి "ఇనాక్"!!

(జులై 1 కొలకలూరి ఇనాక్ జనసం..) -రాధశ్రీ సెల్: 9494481210

తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల.. 90 శాతం ఉత్తీర్ణత



హైదరాబాద్, జూన్ 30: తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఉదయం 11:30 గంటలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులు 5,03,579 మంది పరీక్షలకు హాజరు కాగా, 4,53,201 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా టెన్త్ ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ప్రయివేటు విద్యార్థుల విషయానికి వస్తే 819 మంది హాజరు కాగా, 425 మంది పాసయ్యారు. 51.89 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష ఫలితాలను లిలిలి.నిబినివలిబ.ఇనీఏ అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.

ఈ ఏడాది మే 23 నుంచి జూన్ 1 వరకు పది పరీక్షలు నిర్వహించారు. మొత్తం 5,08,143 రెగ్యులర్ విద్యార్థులకు 5,03,114 మంది ఎస్సెస్సీ పరీక్షలు రాశారు. 167 మంది ప్రయివేటు విద్యార్థులకు 87 మంది పరీక్షలకు హాజరయ్యారు. జూన్ 28 ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేసిన సంగతి తెలిసిందే.

టెన్త్ ఫలితాల్లో బాలికలదే హవా.. 3 వేల స్కూల్లో 100 శాతం ఉత్తీర్ణత

తెలంగాణ పదో తరగతి ఫలితాల్లో బాలికలు తమ సత్తాను చాటారు. 92.45 శాతం ఉత్తీర్ణత సాధించి బాలికలు విజయభేరి మోగించారు. బాలురు 87.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రయివేటు విద్యార్థుల్లోనూ బాలికలదే పైచేయి. బాలికలు 58.76 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 46.21 శాతం పాసయ్యారు. 3,007 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 15 పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పదిహేను స్కూల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు.

రెగ్యులర్ విద్యార్థులు 5,03,579 మంది పరీక్షలకు హాజరు కాగా, 4,53,201 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా టెన్త్ ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ప్రయివేటు విద్యార్థుల విషయానికి వస్తే 819 మంది హాజరు కాగా, 425 మంది పాసయ్యారు. 51.89 శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష ఫలితాలను లిలిలి.నిబినివలిబ.ఇనీఏ అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.

ఆగస్టు 1 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఈ పరీక్షలు 10వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించనున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు జులై 18వ తేదీ లోపు సంబంధిత పాఠశాలల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

టీఆర్ఎస్‌లోకి నలుగురు కాషాయ కార్పొరేటర్లు!!

హైదరాబాద్, జూన్ 30:హైదరాబాద్ వేదికగా జాతీయ కార్యవర్గ సమావేశాలు జరగడానికి ఒక రోజు ముందే బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. బీజేపీకి చెందిన నలుగురు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, తాండూరు మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్‌తో కలిసి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో గురువారం టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్, రాజేంద్రనగర్ కార్పొరేటర్ పొడవు అర్చనప్రకాశ్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ దేరంగుల వెంకటేశ్, అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీతప్రకాశ్‌గౌడ్, తాండూరు మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ సింధూజగౌడ్, కౌన్సిలర్ ఆసిఫ్ పార్టీలో చేరగా, వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, దానం నాగేందర్, పైలెట్ రోహిత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇటీవలే జీహెచ్ఎంసీ బీజేపీ కార్పొరేటర్లతో ఢిల్లీలో ప్రధాని మోదీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మరో 24 గంటల్లో జాతీయ కార్యవర్గ సమావేశాల కోసం హైదరాబాద్ కూడా రానున్నారు. ఈ సమయంలో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులు టీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ ముఖ్య నేతలు షాక్‌కు గురయ్యారు.

ఎంపీ సంతోష్‌ని వరించిన.. "తిమ్మక్క నేషనల్ గ్రీన్ అవార్డ్".. కర్నాటకలో ఘనంగా ప్రోగ్రామ్

హైదరాబాద్, జూన్ 30:తెలంగాణ ప్రకృతి ప్రేమికుడు "గ్రీన్ ఇండియా చాలెంజ్" సృష్టికర్త, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ను "సాలుమారద తిమ్మక్క నేషనల్ గ్రీన్ అవార్డు" వరించింది. పద్మశ్రీ సాలుమారద తిమ్మక్క 111వ జన్మదినాన్ని పురస్కరించుకొని బెంగళూరులోని, వసంత్ నగర్ డా. బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో "వృక్షమాత పద్మశ్రీ సాలుమారద తిమ్మక్క" చేతుల మీదుగా ఈ అవార్డును జోగినిపల్లి సంతోష్ కుమార్ అందుకున్నారు.

"సాలుమారద తిమ్మక్క ఇంటర్ నేషనల్ ఫౌండేషన్" మరియు "శ్రీ సిద్ధార్థ ఎడ్యుకేషనల్ సొసైటి", కర్నాటక వారు సంయుక్తంగా 2020 సంవత్సరానికి గాను దేశంలో అత్యుత్తమ సామాజిక సేవకులకు అందిస్తున్న ఈ అవార్డుల్లో ప్రకృతి పరిరక్షణ విభాగంలో ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం ఆయన వేదికపై మాట్లాడుతూ.. దేశంలో అత్యుత్తమ ప్రకృతి సేవకురాలు, ఆధ్యాత్మిక గరువు ఆధ్వర్యంలోని కమిటీ తనను ఇంతటి అద్భుతమైన అవార్డునకు ఎంపిక చేయడం నా పూర్వజన్మ సకృతం అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నడిచిన బాటలో తను అడుగులో అడుగేస్తూ.. తన వంతుగా ఏదైనా చేయాలనే సంకల్పంతో సరిగ్గా ఐదేళ్ల క్రితం "గ్రీన్ ఇండియా చాలెంజ్" కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఎంపీ సంతోష్? తెలిపారు. ఒకరికొకరు.. మరొక మిత్రున్నో, కుటుంబ సభ్యున్నో చెట్లు నాటేలా ప్రోత్సహించాలనే చిన్న ప్రయత్నంతో మొదలు పెట్టిన ఈ కార్యక్రమం ఇవ్వాల ఖండాలు దాటడం తన ఘనతగా భావించడం లేదని, ఈ నేల భవిష్యత్ తరాలతకు అందకుండా పోతుందేమోనని స్పందించే ప్రతీ హృదయానికి, "గ్రీన్ ఇండియా చాలెంజ్" లో మొక్కలు నాటిన ప్రతీఒక్కరికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, "గ్రీన్ ఇండియా చాలెంజ్" కార్యక్రమాన్ని ఉధృతంగా ముందుకు తీసుకుపోయేందుకు కావల్సిన శక్తిని అందించిందని ఎంపీ సంతోష్? అన్నారు. ఈ వర్షాకాలం సీజన్ లో ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అంతేకాదు.. తనతోపాటు అవార్డును అందుకున్న ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ పద్మశ్రీ ఎ.ఎస్ కిరణ్ కుమార్ , ప్రముఖ నిర్మాత రంగనాథ్ భరద్వాజ్, ప్రముఖ విద్యావేత్త, రచయిత గురురాజా కరజ్జయిని, సత్యామోర్గానికి సంతోష్? శుభాకాంక్షలు తెలిపారు. వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో కర్నాటక మాజీ ఉపముఖ్యమంత్రి గంగాధరయ్య పరమేశ్వరతో పాటు సిద్ధార్థమఠం పీఠాధిపతి హ్వారనహల్లి శ్రీశ్రీ సద్గురు శంకరానంద మహాస్వామి, ఇతర పీఠాధిపతులు, సాలుమారద తిమ్మక్క ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బోనమెత్తిన గోల్కొండ..పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు

హైదరాబాద్, జూన్ 30:గోల్కొండ కోట బోనమెత్తింది. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు గురువారం అంగరంగ వైభవంగా అంకురార్పణ జరిగింది. లంగర్‌హౌజ్ చౌరస్తా వద్ద బంగారు బోనానికి మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ దీపం వెలిగించి, పూజలు నిర్వహించి తొట్టెలకు స్వాగతం పలికారు.

అనంతరం శ్రీ జగదాంబిక అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సీఎం కేసీఆర్ రూ.15 కోట్లు కేటాయించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించేలా అమ్మవారి ఆశీస్సులు కలకాలం కొనసాగాలని ప్రార్థించామన్నారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యశ్వంత్ సిన్హాకు ఘనంగా స్వాగతం పలుకుదాం : కేటీఆర్

హైదరాబాద్, జూన్ 30: విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా జులై 2వ తేదీన హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో సిన్హాకు స్వాగత ఏర్పాట్లు, ఆయనకు మద్దతుగా నిర్వహించే సభపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ మంత్రులు, ఇతర నాయకులతో సమావేశం నిర్వహించారు. యశ్వంత్ సిన్హాకు ఘనంగా స్వాగతం పలుకాలని టీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని మంత్రులకు కేటీఆర్ ఆదేశించారు. 2వ తేదీన ఉదయం 10 గంటలకు యశ్వంత్ సిన్హా ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అక్కడ్నుంచి నేరుగా జలవిహార్‌కు సిన్హా చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు యశ్వంత్ సిన్హాకు మద్దతుగా టీఆర్ఎస్ పార్టీ సభ నిర్వహించనుంది. ఈ సమావేశానికి టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

పంచాయతీ భవనాలు మంజూరు చేయండి : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, జూన్ 30:రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద రాష్ట్రంలో కొత్తగా వెయ్యి నూతన పంచాయతీ భవనాలు మంజూరు చేసి, నిధులు విడుదల చేయాలని.. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కేంద్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరి రాజ్ సింగ్‌ను కోరారు.

గురువారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి గిరి రాజ్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో రాష్ట్ర ప్రగతి పై మాట్లాడారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి మూడు అంశాలకు సంబంధించిన లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..శ్యాం ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ పనులను రాష్ట్రంలో పునరుద్ధరించాలన్నారు .రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ రాజ్ నూతన భవనాలకు ప్రస్తుతం ఉపాధి హామీ కింద ఇస్తున్న రూ.20 లక్షల నిధులను రూ.25 లక్షలకు పెంచాలని కోరినట్లు ఆయన వివరించారు. అలాగే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద రాష్ట్రంలో కొత్తగా వెయ్యి నూతన పంచాయతీ భవనాలు మంజూరు చేసి, నిధులు విడుదల చేయాలని కోరినట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి అత్యధిక 10 జి.పి.ఏ లతో

అల్ఫోర్స్ జయకేతనం

కరీంనగర్ , జూన్ 30(నేటినిజం ప్రతినిధి): సంచలన విజయాలకు మరియు అత్యుత్తమ విద్యకు నిర్వచనం అల్ఫోర్స్ విద్యాసంస్థలని మరియు విద్యార్థులకుప్రపంచ ప్రమాణాలతో విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించడంలో ఏటువంటి అతిశయోక్తి లేదని అల్ఫోర్స్విద్యా సంస్థల అధినేత డా॥ వి. నరేందర్రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రైనిటాట్స్ ప్రాంగణంలో 10వ

తరగతి ఫలితాలలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ 10 జి.పి.ఏ. లు సాధించడం పట్ల

ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యా సంస్థలు చక్కటి ప్రణాళికలను రూపొందిస్తూ విద్యార్థులకుఅనుగుణంగా విద్యను అందిస్తూ ఘనవిజాయాలే లక్ష్యంగా ముందుకు పయనిస్తున్నదని చెప్పారు. అందుకు నిదర్శనంఇటీవల కాలంలో ప్రకటింపబడుతున్న ఫలితాలే అని మరియు నేటి 10వ తరగతి ఫలితాలు కూడా అని చెప్పారు. కరోనా ముందు మరియు తరువాత అల్ఫోర్స్ విద్యాసంస్థలు సంచలన విజయాల పరంపరను దిగ్విజయంగా కొనసాగిస్తూఇతర విద్యాసంస్థలకు ధీటుగా నిలూస్తు చక్కటి భవిష్యత్తునూ అందిస్తూన్నదని తెలుపుతూ నేడు అల్ఫోర్స్ గ్రూప్ అఫ్స్కూల్కు చెందినటువంటి 139 విద్యార్థులు విశేష ప్రతిభను కనబరచడమే కాకుండా 10 జి.పి.ఏ ను సాధించారని చెప్పారు. 141 విద్యార్థులు 9.8 జి.పి.ఏ సాధించారని మరియు 100 విద్యార్థులు 9.7 జి.పి.ఏ ను కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు మరియు విజయపరంపరనుకొనసాగించడానికై ఆహార్నిశలు కృషిచేస్తున్న ఉపాధ్యాయులకు మరియు సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

10 జి.పి.ఏ విద్యార్థులందరికి పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

వైద్య సిబ్బంది కొరతతో పడకేసిన ప్రజారోగ్యం

(01 జూలై 'జాతీయ వైద్యుల దినోత్సవం' సందర్భంగా)

భారతరత్న (1961), పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి (1948-62), స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్త, ప్రముఖ డాక్టర్ బిదన్ చంద్ర రాయ్ (బి సి రాయ్) జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఏట 01 జూలై రోజున భారతదేశవ్యాప్తంగా 'జాతీయ వైద్యుల దినోత్సవం (నేషనల్ డాక్టర్స్ డే)' పాటించడం జరుగుతున్నది. 1991 నుంచి మనం ఘనంగా నిర్వహించుకుంటున్న 'జాతీయ వైద్యుల దినం-2021' నినాదంగా 'ఆరోగ్య పరిరక్షణలో ముందు వరుసలో కుటుంబ వైద్యులు(ఫామిలీ డాక్టర్ ఆన్ ది ఫ్రంట్‌లైన్)' అనబడే అంశాన్ని తీసుకోన్నారు. మనిషి ఎన్ని మెట్లు ఎక్కినా, ఏ శిఖరాగ్రాన్ని ముద్దాడలన్నా, ఎంత సంపాదించినా, ఎన్ని ఘనకార్యాలు సాధించినా, ఎన్ని అవార్డులు పొందినా, ఎన్ని మహల్‌లు నిర్మించినా వ్యక్తిగత ఆరోగ్యం లేనపుడు అవన్నీ బూడిదలో పోసిన పన్నీటి సమానమే అవుతుందని మనకు తెలుసు.

కరోనా వారియర్స్ విశిష్ట సేవలు:

డిసెంబర్-2019లో చైనాలో ప్రారంభమైన కరోనా కల్లోలంతో ప్రపంచ మానవాళి గత రెండు ఏండ్లుగా దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడింది. 4వ కరోనా అల రావచ్చున్న హెచ్చరికల విపత్కర సమయాన మనందరి ఆరోగ్య పరిరక్షణకు తమ ప్రాణాలను పణంగా పెట్టి 24/7 గంటలు అవిశ్రాంత సేవలు అందిస్తున్న ప్రత్యక్ష దేవుళ్ల రూపంలో కనిపిస్తున్న వైద్యులు అసమాన్య త్యాగాలు చేస్తున్నారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అందించిన, అందిస్తున్న సేవలకు స్పందించిన సమాజం వారికి అవధులు లేని కృతజ్ఞతలను అందిస్తున్నది. కరోనా అలల సునామీకి ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సీజన్, ఔషధాలు, వెంటిలేటర్లు, ఐసియుల కొరత డాక్టర్లను నిస్సహాయుల్ని చేసింది. కోవిడ్-19 బారిన పడిన వ్యక్తులకు ఆత్మస్థైర్యం పెంపొందించడానికి, సరైన వైద్యాన్ని సకాలంలో అందించడానికి, కరోనా సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడానికి, నేనున్నాననే భరోసా కల్పించడానికి డాక్టర్లు అందించిన సేవలు అసమాన్యాలు, అభినందనీయాలు. తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, పిపిఈ కిట్లు ధరిస్తూ, తమ ప్రాణాలకు లెక్కచేయకుండా వైద్యులు అందించిన సేవలకు కోట్ల ప్రాణాలు గాల్లో కలువకుండా నిలిచిపోయాయి.

వైద్యోనారాయనోహరిః:

విశ్వవ్యాప్తంగా అత్యున్నత గౌరవం పొందుతున్న వృత్తి వైద్యరంగమే. అందుకే మన సంస్కృతిలో 'వైద్యోనారాయనోహరిః' అని పిలుస్తాం. జాతి ఆరోగ్య జెండాను తమ భుజాన మోస్తున్న పవిత్ర వైద్యుల త్యాగాలు వెలకట్టలేనివి. దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐయంఏ) శాఖలు జాతీయ వైద్యుల దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటాయి. నేడు అన్ని వర్గాల ప్రజలు వైద్యులను నడిచే దైవాలుగా పూజించడం జరుగుతున్నది. వైద్యులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశిస్తూ, వారిని రక్షించుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందని మరువరాదు. 01 జూలై 1882న జన్మించిన డా: బి సి రాయ్ ఎనిమిది దశాబ్దాలు బహుముఖీన సేవలందించిన అనంతరం 01 జూలై 1962 తుది శ్వాసనొదిలారు. ఒక్కొక్క దేశంలో (యుయస్‌లో 30 మార్చి) డాక్టర్స్ డేను వేరు వేరు తేదీలో నిర్వహించుట జరుగుతున్నది.

వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రుల కొరత:

ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల ప్రకారం ప్రతి 1,000 మంది జనాభాకు ఒక్క డాక్టర్, ముగ్గురు నర్సులు అవసరం అవుతారని, ఇండియాలో 1,457 జనాభాకు ఒక డాక్టర్, 1.7 నర్సులు మాత్రమే ఉన్నారని తెలుస్తున్నది. అలాగే ప్రతి వెయ్యి జనాభాకు 3 ఆసుపత్రి పడకలు అవసరం ఉండగా ప్రతి 2,239 జనాభాకు ఒక్క ఆసుపత్రి పడక (10,000 జనాభాకు 5.2 పడకలు) అందుబాటులో ఉన్నది. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దాదాపు 60 శాతం పురుష ఆరోగ్య సేవకులు, 51 శాతం ల్యాబ్ టెక్నీషియన్లు, 75 శాతం ఫిజీసియన్స్, 86 శాతం సర్జన్ల కొరత ఉన్నది. తీవ్రమైన హెల్త్ వర్కర్ల కొరతతో ప్రజారోగ్య పరిరక్షణ గాల్లో దీపమైంది. గ్రామీణ భారతంలో ఆసుపత్రులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరత ఉంది. భారతదేశవ్యాప్తంగా 69,265 ఆసుపత్రులు, 1,899,228 బెడ్స్ అందుబాటు ఉన్నట్లు అంచనా. క్రిటికల్ కేర్ విభాగంలో తీవ్రమైన ఆసుపత్రి పడకల కొరత ఉంది.

ఇండియా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ప్రజారోగ్యం ముందు వరుసలో నిలుస్తుంది. భారతదేశంలో నేటి అలోపతితో పాటు అనాదిగా అందుబాటులో ఉన్న ధన్వంతరి, చరక, సుశ్రూత, జీవక, ఆయుర్వేద, హోమియోపతి, నాచురోపతి, యునానీ లాంటి పలు వైద్యరంగాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయి. వైద్యులు ఏ రంగానికి చెందిన వారైనా, వారందరికి కృతజ్ఞతలను తెలుపవలసిన కనీస బాధ్యత మనందరి మీద ఉన్నది. వైద్యుల్లో మానవీయత, చారిటీ, త్యాగం, ధైర్యం, గౌరవం, విలువలతో కూడిన రూపం కనబడుతుంది. అలాంటి డాక్టర్ల సూచనలు, సలహాలను పాటిస్తూ మహమ్మారుల కోరలను పీకేద్దాం. విపత్తుల సమయాన కరోనా వారియర్స్‌గా ముందు వరుసలో ఉన్న వైద్యులను అపూర్వంగా గౌరవించుకుందాం, ఆరాదిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జిల్లాలో అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు

ఖమ్మం, జూన్ 30 (నేటి నిజం ప్రతినిధి) :అక్రమ రవాణా మార్గాలపై దృష్టి కేంద్రీకరించిన పోలీస్ శాఖ..జిల్లా వ్యాప్తంగా ఎనిమిది చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ చెక్ పోస్ట్ ను అకస్మీకంగా సందర్శించారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు, శ్రీశ్రీ సర్కిల్ లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అక్రమ రవాణా మార్గాలపై దృష్టి కేంద్రీకరించిన పోలీస్ శాఖ...అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని పెర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలకు హాని కలిగించే ప్రభుత్వ నిషేధిత ఉత్పత్తులు గంజాయి, గుట్కా వంటి విక్రయాలు, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడానికి నిఘా వ్యవస్థను పటిష్టం చేశామని, అదేవిధంగా అక్రమ వ్యాపార మూలాలపై దృష్టిపెట్టి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కట్టడి చేస్తున్నామని తెలిపారు. పశువులు, ఆవులు, లెగదూడల అక్రమ రవాణా నియంత్రణ కోసం సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ద్వారా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా తరలిస్తే చర్యలు తప్పవన్నారు.జిల్లా వ్యాప్తంగా నమోదైన ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ కేసుల పర్యవేక్షణకు వేదికగా చేసుకొనిమాదకద్రవ్యాల ఉత్పత్తి, సరఫరా, అమ్మకాల హాట్ స్పాట్‌ల గుర్తింపు, ఇతర రాష్ట్రాల (డ్రగ్స్/మాదకద్రవ్యాల నేరస్థుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేయడం ద్వారా దర్యాప్తు వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

మానవ అక్రమ రవాణా మొదలు నకిలీ విత్తనాల తయారీ కేంద్రాలు, అక్రమ రవాణా మార్గాలపై పోలీసులు దృష్టి సారించి.. ఇతర రాష్ట్రాలలో నకిలీ విత్తనాలు తయారుచేసే మూరాలు అక్కడి నుంచే రాష్ట్రంలోకి తరలిస్తున్నట్టుగా గుర్తించిజిల్లాల్లోని సరిహద్దు ప్రాంతాలపై అధికారులు పటిష్ట నిఘా పెట్టారని తెలిపారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ

- 31 చెక్కులకు గాను రూ.31 లక్షల పంపిణీ..

ఖమ్మం, జూన్ 30 (నేటి నిజం ప్రతినిధి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకం ద్వారా మంజూరైన 31 మందికి చెక్కులకు గాను రూ.31 లక్షల విలువైన చెక్కులను మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్వయంగా పంపిణీ చేశారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవద్దు అనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు.ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు.కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, జడ్పి చైర్మన్ లింగాల కమల్ రాజ్, తహసీల్దార్ శైలజ, కార్పొరేటర్ లు కమర్తపు మురళి, రుద్రగాని శ్రీదేవి, తోట దనమ్మ, సరస్వతి, నాయకులు బొమ్మెర రాంమూర్తి, ఏఏంసి చైర్మన్ లక్ష్మిప్రసన్న, తదితరులు ఉన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీకి అగ్రస్థానం

న్యూఢిల్లీ, జూన్ 30: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈఓడీబీ) లో తెలుగు రాష్ట్రాలు అదరగొడ్తున్నాయి. బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ 2020 ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ఏడు రాష్ట్రాలను అగ్రగామిగా కేంద్రం ప్రకటించగా, ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్థానం దక్కింది. గుజరాత్, హర్యానా, కర్ణాటక, పంజాబ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కేంద్రం మొత్తం 4 క్యాటగిరీల్లో రాష్ట్రాలకు ర్యాంకులు ఇచ్చింది.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 97.89 శాతం స్కోర్‌తో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. కాగా, గుజరాత్ 97.77 శాతం, తమిళనాడు 96.97 శాతం, తెలంగాణ 94.86 శాతంతో రెండో స్థానంలో నిలిచాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కొత్త విధానాలతో కేంద్రం ఈ ర్యాంకింగ్ ప్రక్రియను చేపట్టింది. 10,200 మంది పెట్టుబడిదారులు మరియు వాటాదారుల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించబడింది.

రెండో జాబితాలో హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు 80-90 శాతం స్కోర్‌తో ఉన్నాయి. అలాగే అసోం, ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, కేరళ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు 50 నుంచి 80 శాతం స్కోరుతో మూడో జాబితాలో ఉన్నాయి. ఢిల్లీ, బీహార్, ఇతర కేంద్ర పాలిత ప్రాంతాలు 50 శాతం కంటే తక్కువ స్కోర్ చేశాయి. 2015 నుంచి కేంద్రం ఈ ర్యాంకింగ్స్ ప్రకటిస్తూనే ఉన్నది. ఈ ర్యాంకింగ్స్‌ను ప్రతి ఏటా ప్రకటిస్తుండగా.. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా గత ఏడాది వాయిదా వేసినట్లు తెలుస్తున్నది.

దేశ ఆర్థిక, సుస్థిర వృద్ధి లక్ష్యాలను సాధించడానికి వివిధ గుణాత్మక విధానాలు, జోక్యాలను చేపట్టింది: శ్రీ హర్దీప్ ఎస్. పూరి

న్యూఢిల్లీ, జూన్ 30:భారతదేశం ప్ర పంచంలోనే రెండో అతిపెద్దపట్టణ వ్యవస్థ అని, మొత్తం ప్రపంచ పట్టణ జనాభాలో 11% మంది భారతీయనగరాలలో నివసిస్తున్నారని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి

శ్రీ హర్దీప్ ఎస్. పూరి అన్నారు.2018-2050 మధ్య కాలంలో మన పట్టణ జనాభాలో 416 మిలియన్ల మంది చేరతారని ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోందని ఆయన చెప్పారు.భారత దేశ ఆర్థిక లక్ష్యాలను సాధించడం లో మాత్రమే గాక సుస్థిర వృద్ధి లక్ష్యాలను సాధించడంలో కూడా మనగరాలు కీలకమైన పాత్రను పోషిస్తాయని, భారత దేశ నగరాలు జాతీయ జీడీపీలో దాదాపు 70% వాటాను అందిస్తున్నాయని, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల్లో 44% వాటాను భారత నగరాలు కలిగిస్తున్నాయని ఆయన అన్నారు.

పోలాండ్ లోని కోటవిన్ లో జరుగుతున్న 11వ వరల్డ్ అర్బన్ ఫోరమ్ లో మంత్రుల స్థాయి రౌండ్ టేబుల్ లో జూన్ 28న భారత ప్రతినిధి వర్గం నాయకుడు, ఎంఒహెచ్ యుఎఅదనపు కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్ మంత్రి ప్రసంగాన్ని చదివి వినిపించారు.

భారత ప్రభుత్వం నిద్రాణ స్థితిలో ఉన్న సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుందని పేర్కొన్న మంత్రి, 2014 నుండి భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ కార్యక్రమాన్ని చేపట్టిందని, న్యూ అర్బన్ ఎజెండా ప్రధాన సూత్రాలను అవలంబించే వివిధ పరివర్తనాత్మక విధానాలు, జోక్యాల ఫలితంగా భారతదేశ ఆర్థిక , సుస్థిర వృద్ధి లక్ష్యాలను సాధించడానికి భారతీయ నగరాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి అన్నారు.

భారతదేశ పట్టణాభివృద్ధి ప్రాధాన్యతల పిరమిడ్ సహకార , పోటీ సమాఖ్య, ప్రాథమిక సేవల సార్వత్రికీకరణ, గ్రామీణ-పట్టణ కొనసాగింపుపై ఆధారపడి ఉందని శ్రీ హర్దీప్ ఎస్.పూరి అన్నారు.హౌసింగ్ ఫర్ ఆల్' 'క్లీన్ ఇండియా మిషన్' పథకాలు గృహనిర్మాణం, పారిశుధ్య ప్రాథమిక అవసరాలను తీరుస్తాయని ఆయన అన్నారు.ముఖ్యంగా 'క్లీన్ ఇండియా మిషన్' ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని, నగరాల వార్షిక పరిశుభ్రత సర్వే ప్రపంచంలోనే అతిపెద్ద పట్టణ పారిశుధ్య సర్వే అని ఆయన అన్నారు.

పై రెండు పథకాలను, పట్టణ ప్రాంతాల నిర్దిష్ట అవసరాలను విజయవంతంగా పరిష్కరించిన ఇతర ప్రధాన (ఫ్లాగ్ షిప్) కార్య క్రమాలను గురించి ప్రస్తావిస్తూ, అటల్

మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ ఫర్మేషన్ (అమృత్) మంచి నీటి సరఫరా, పార్కులు, వీధి దీపాలు వంటి మౌలిక పౌర సదుపాయాలను కల్పిస్తోందని మంత్రి చెప్పారు.భారతదేశ స్మార్ట్ సిటీస్ మిషన్ పౌర-కేంద్రిత కార్యక్రమాల ద్వారా 100 స్మార్ట్ నగరాల్లో జీవన నాణ్యతను గణనీయంగా పెంచిందని తెలిపారు. పిఎం స్ట్రీట్ వెండర్స్ స్వావలంబన నిధి ఒక ప్రత్యేకమైన ప్రయోగం అని, దీని ద్వారా మహమ్మారి సమయంలో అత్యంత నిస్సహాయ వర్గమైన వీధి వ్యాపారులకు పూచీకత్తు లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందించారని శ్రీ పూరి అన్నారు.''మా స్థిరమైన పట్టణ రవాణా విధానాలు పారిస్ ఒప్పందంలోని వాతావరణ మార్పు కట్టుబాట్లను నెరవేర్చడానికి రూపొందించబడ్డాయి.ప్రతి సంవత్సరం, వాతావరణ మార్పులకు ప్రతిఘటనగా భారతదేశ పట్టణ ప్రకృతి దృశ్యానికి రికార్డు స్థాయిలో ప్రజా రవాణా , చలనశీలత ఎంపికలు జోడించబడుతున్నాయి'' అని ఆయన తెలిపారు.మహమ్మారి ప్రారంభం పట్టణ లోపాల రేఖలను తీవ్రతరం చేసిందని, సహజ అసమానతలను బహిర్గతం చేసిందని శ్రీ పూరి అన్నారు, మహమ్మారి నుండి మనం బయటపడుతున్న ప్రస్తుత సమయం లో మన విధానాలను సమ్మిళితం, లింగ సమానత్వం , పర్యావరణ న్యాయం దిశగా అనుసంధాని ంచ వలసిన అవసరం ఉందని మంత్రి అన్నారు.

పట్టణ సమాజంలోని అణగారిన వర్గాలకు ప్రభుత్వాలు సాధికారత కల్పించాలని ఆయన అన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీలు, సంక్షేమ ప్రయోజనాల పోర్టబిలిటీ, సరసమైన ధరలో అద్దె గృహాలు వంటి చర్యల ద్వారా భారతదేశం మహమ్మారి కష్టాలను తగ్గించిందని ఆయన అన్నారు.వసుదైక కుటుంబం అంటే 'ప్రపంచం ఒకే కుటుంబం' అనే తత్త్వాన్ని అనుసరించే వారిగా, తోటి దేశాలతో ఉత్తమ విధానాలను పంచుకోవడం ప్రాముఖ్యతను భారతదేశం విశ్వసిస్తుందని మంత్రి అన్నారు.సంపన్నమైన , సుస్థిరమైన ప్రపంచం కోసం భాగస్వామ్య లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మన అనుభవాలను తెలుసుకోవడానికి , పంచుకోవడానికి 11వ వరల్డ్ ఫోరమ్ దోహద పడాలని మంత్రి ఆకాంక్షించారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు జారీ...!

-జిల్లా అదనపు కలెక్టర్ రాజర్షి షా.

సంగారెడ్డి, జూన్ 30 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరీ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రాజార్షి షా పేర్కొన్నారు.

సంగారెడ్డి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం బుధవారం అదనపు కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన ఆయన ఛాంబర్లో జరిగింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు 2022 -2024 సంవత్సరాలకు సంబంధించి జారీ చేయవలసిన కొత్త అక్రిడిటేషన్ కార్డుల విషయమై అదనపు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, చర్చించిన మీదట కమిటీ చైర్మన్ హోదాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లల మంజూరీకి ఆమోదం తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి విజయలక్ష్మి, ఆర్టీసీ డి ఎం. ఇ.వి సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఎం. ఎ. కె. ఫైసల్, కరుణాకర్ రెడ్డి, యోగానంద రెడ్డి, శ్రీధర్, ప్రభాకర్, డేవిడ్ రాజ్, శివ ప్రసాద్, హరికృష్ణ, పాల్గొన్నారు.

వైసీపీకి ఓటేయకపోతే ప్రజలకు పాపం.. వారిని ఆ దేవుడే చూసుకుంటాడు: బొత్స వ్యాఖ్యలు

విజయనగరం, జూన్ 30: చీపురుపల్లి నియోజకవర్గం పార్టీ ప్లీనరీలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీకి ఓటేయాలని అడగడానికి బదులుగా.. తమ పార్టీకి ఓటేయకుంటే ప్రజలకు పాపం అంటుకుంటుందని, అలాంటి వారి సంగతి ఆ దేవుడే చూసుకుంటాడని చెప్పి ప్రజలను దూషించారు. తాను మంత్రిగా గత ప్రభుత్వాల్లో పనిచేశానని, ఈ ప్రభుత్వం అంత మంచిది చూడలేదని కితాబిచ్చారు.

గ్రామ, మండల స్థాయిలో పార్టీ నేతల మధ్య విభేదాలున్నాయని విద్యాశాఖ మంత్రి బొత్స అంగీకరించారు. ఈ విభేదాలను తొలగించి పార్టీ కోసం సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని, ఐక్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు, స్థానిక నాయకత్వానికి సూచించారు. మన ప్రభుత్వం చేసే మంచి పనులే మనల్ని మరోసారి విజేతగా నిలుపుతాయన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. తాను గతంలో మూడు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశానని, అయితే ఈ ప్రభుత్వమే ది బెస్ట్ అని ప్రశంసించారు.

సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందుతున్నందున ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ఆదుకోవాలని బొత్స చెప్పారు. 1998 డీఎస్సీ కింద నియమితులయ్యే వారి సామర్థ్యం, నైపుణ్యాలపై విద్యా మంత్రి సందేహాలు లేవనెత్తారు. ఎంపికైన అభ్యర్థుల గురించి, వారి సేవలను ఎలా వినియోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచిస్తున్నదని చెప్పారు. ఎవరూ శాశ్వతంగా అధికారంలో ఉండలేరని, విధి, కాలమే ఎవరినైనా నాయకుడిని చేస్తుందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సహోద్యోగులతో, ప్రజలతో సక్రమంగా ప్రవర్తించాలని బొత్స సూచించారు.

అల్లూరి జయంతి వేడుకలకి - చంద్రబాబుకి ఆహ్వానం పలికిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 30:కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి .. అల్లూరి సీతారామ రాజు 125వ జయంతి వేడుకలకి హాజరు కావాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడికి ఆహ్వానం పంపారు. జూలై 4న భీమవరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125 జయంతి వేడుకలు జరగనున్నాయి.అల్లూరి జయంతి వేడుకలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరవు తున్న సంగతి తెలిసిందే. ఈ జయంతి వేడుకల్లో భాగంగా భీమవరంలో అల్లూరి విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరించనున్నారు. అట్టహాసంగా జరగనున్నఈ కార్యక్రమానికి రావాలంటూ ఇప్పటికే టాలీవుడ్ అగ్ర హీరో, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవికి కూడా కిషన్ రెడ్డి ఆహ్వానం పలికిన సంగతి తెలిసిందే. తాజాగా చంద్రబాబునూ ఆహ్వానిస్తూ కిషన్ రెడ్డి ఆహ్వానం పంపడం గమనార్హం.

లక్ష్యానికి మించి పంట రుణాలు అందించాలి - క్రాప్ లోన్ రుణ మేళాను నిర్వహించాలి

-పీఎం ఈజీపీలో ప్రతి బ్యాంక్ ఒక యూనిట్ గ్రౌండ్ చేయాలి.

-వీధి వర్తకులకు మంజూరైన రుణాలు బ్యాంకర్లు వెంటనే అందించాలి.

-2022-23 సంవత్సరానికి రూ.6,997 కోట్లతో జిల్లావార్షిక రుణ ప్రణాళిక విడుదల.

-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, జూన్ 30 (నేటి నిజం ప్రతినిధి) బ్యాంకర్లు పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రైతాంగానికి నిర్దేశిత లక్ష్యానికి మించి రుణాలు అందించేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ బ్యాంకర్లకు హితవు పలికారు.

బుధవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. గత సంవత్సరం కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందించగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులకు ఆర్థిక వెసులుబాటు కలిగేలా బ్యాంకర్లు విరివిగా రుణాలు పంపిణి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అర్హులైన ప్రతి రైతు పంట రుణ సదుపాయాన్ని పొందేలా ప్రత్యేకంగా జులై 5 నుండి 31 వరకు రుణ మేళాను నిర్వహించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కు సూచించారు. రుణాల రికవరీ విషయమై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు.నిర్ణీత లక్ష్యంలో సగటున కనీసం 95 శాతం మేర పంట రుణాల పంపిణి తప్పనిసరిగా జరిగేలా చొరవ చూపాలన్నారు. వీధి వర్తకులకు రుణాలు మంజూరైనప్పటికీ ఇంకా చెల్లింపులు జరగలేదని, వారికి వెంటనే చెల్లింపు జరిగేలా చూడాలన్నారు. 10 వేల రుణం తీసుకున్న వారందరికీ రీపేమెంట్ చేయిస్తే 20 వేల లోను వస్తుందని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని మెప్మా పీడి కి సూచించారు.స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో అలసత్వ వైఖరిని ప్రదర్శించకూడదని అన్నారు. ఈ సంవత్సరం జూలైలోగా లక్ష్యంలో 50 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా పి ఎం ఈ జి పి లో కనీసం ప్రతి బ్యాంక్ ఒక యూనిట్ గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్ డి ఎం కు సూచించారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ శాఖలకు సంబంధించిన పెండింగ్ యూనిట్లను ప్రాధాన్యతా పరంగా త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు.5,897.02 కోట్ల రూపాయలను ప్రాధాన్యత రంగాలకు, రూ.1099.98 కోట్లు ప్రాధాన్యేతర రంగాలకు రుణాలు పంపిణీ చేయడం లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సమావేశంలో ఎల్ డి ఎం గోపాల్ రెడ్డి, నాబార్డ్ ఏ జీ ఎం , ఆర్ బి ఐ అధికారి , సంక్షేమ శాఖల అధికారులు, డి ఆర్ డి ఓ పిడి శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, పరిశ్రమలు తదితర శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్‌గా రాజీవ్ సాగర్

హైదరాబాద్, జూన్ 30: మేడే రాజీవ్ సాగర్‌ను తెలంగాణ ఫుడ్స్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన రెండేండ్ల పాటు కొనసాగనున్నారు. మహిళా, శిశు , వికలాంగ, సీనియర్ సిటిజన్స్ విభాగం కింద తెలంగాణ ఫుడ్స్ కొనసాగుతున్నది.

అదేవిధంగా, తెలంగాణ అధికార భాషా సంఘం చైర్మన్ గా మంత్రి శ్రీదేవి, తెలంగాణ ఉర్దూ అకాడెమి అధ్యక్షుడిగా మహమ్మద్ ఖాజా ముజీబుద్దీన్‌లను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

తెలంగాణ జా

25

స్వేచ్ఛ-2

- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి చైర్మన్, టీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటికన్నూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

- సంపాదకులు.



జయ ఫోన్ చేసి సుదీర్ఘంగా చర్చించి తన నిర్ణయాన్ని చెప్పినప్పుడు మానస మనస్సు మనస్సులో లేదు. పరిపరి విధాల ఆలోచనలు. జీవితాలు ఎలా మలుపు తిరుగుతున్నాయో... అనుకున్నదొకటి, జరిగేది ఒకటి. ఇందులో తమ ప్రమేయం లేకుండానే సాగిపోయే పరిణామాలు ఎన్నో... జయ ప్రమేయం లేకుండానే ఆమె జీవితంలో ఇలాంటి దుస్థితి ఎందుకు ఏర్పడుతున్నది? అన్నీ సమకూరిన జీవితం. సమాజంలో ఎంతో గౌరవం. జయకు ఎంతో మంది సిబ్బంది ఉన్నారు. జయ కూడా సంపాదిస్తున్నది. జకు ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ఉంది. అయినా సమస్యలు... కష్టాలు... ఏమిటో అనుకుంది మానస.

×-×-×

వర్షాకాలం మునుపెన్నడూ లేనంతగా వర్షాలు. ఎక్కడ చూసినా పచ్చగా... ఎక్కడ చూసినా నీళ్ళే నీళ్ళు. ముసురు పట్టి కొద్దిరోజులు వర్షం. వరుసగా కుంభవృష్టి కొద్ది రోజులు...

కుంభవృష్టి కురిసిన తర్వాత వాగులు, నదులు ప్రవహించి చెరువులు నిండిపోయాయి. ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. చెరువులు నిండి, కాలువలు నిండి రోడ్లు జలమయమైపోయాయి.

చెరువులు బాగా నిండి మత్తడి దుంకింది. మత్తడి దుంకుతుంటే పిల్లలు, పెద్దలు చాలాకాలం తర్వాత చెరువులు నిండాయని సంతోష పడిపోతున్నారు. పిల్లలు ఇంటిముందు కాలువల్లో కాగితపు పడవలు చేసి ఆడుకుంటున్నారు. మట్టిలో సలాక దిగేస్తే సలాక వెంట ముందుకు సాగుతూ ఆడుకుంటున్నారు. బురదను కాళ్ళకు చేతులకు పూసుకొని ఎగురుతున్నారు. సైకిళ్ళు బురద మట్టి అంటుకొని సైకిళ్ళపై వెళ్ళే వాళ్ళు ఇప్పుడు సైకిళ్ళను భుజానికెత్తుకొని నడుస్తున్నారు. చెప్పులు తొడుక్కుని నడిచే వాళ్లు చెప్పులను మోసుకొని నడుస్తున్నారు.

బాగా నిండిన చెరువులు... బాగా మత్తడి దుంకుతూ ఒర్రెలు ఒడ్లు ఒరుసుకొని ప్రవహిస్తూ కింది పొలాలకు, చెరువులకు నీళ్ళను వేగంగా అందిస్తున్నాయి.

రాత్రంతా నిలకడగా కురిసిన వర్షం తెల్లవారే సరికి వరదలైంది. నిండిన చెరువులు మత్తడి నుండి నీరు ఇంకా పెరిగి చెరువు కట్టలు తెగిపోతున్నాయి. ఎక్కడి చెరువు అక్కడ తెగుతుంటే ఆ నీళ్ళన్నీ కింది చెరువులో పడి కింది చెరువులు కూడా కట్టలు తెగుతున్నాయి. ఊరూరా హాహాకారాలు. ఎక్కడికక్కడ ఇసుక బస్తాలు నింపి చెరువు కట్టను తెగకుండా అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వాగుల్లో పడి గడ్డి, గాదం కొట్టుకుపోతున్నాయి. కొన్ని చెట్లు వేర్లతో కొట్టుకుపోయి ఎక్కడో వాగు ఒడ్డుకు పడేసాయి.

నెల గడిచింది. ప్రకృతి పచ్చదనంతో కాంతులీనుతోంది. జరిగిన ప్రకృతి బీభత్సం నుండి తిరిగి తలెత్తుకొని నిటారుగా నిలిచింది. మనుషులు మళ్లీ అన్నీ మరచి వ్యవసాయ పనుల్లో పడ్డారు. మానస, తల్లి మాధవి, ప్రిన్సిపాల్ రామచంద్రయ్య కలిసి కారులో పెళ్లి ఫంక్షన్‌కి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు.

మానస ఆ పరిసరాలు చూస్తూ పరవశించి పోతోంది. పని బిజీలో జీవితంలో ఎంత కోల్పోతున్నామో... బాధ కలిగింది.

"నాన్నా! ఈ ప్రకృతి, పరిసరాలు, పక్షులు, ఆ నదీ తీరం, ఆ ఇసుక తిన్నెలు ఎంత బాగున్నాయో... స్వేచ్ఛగా మనిషి వీటిలో లీనమై జీవిస్తే ఎంత బాగుంటుందో...!! ఇలాంటి పరిసరాల మధ్య ఒక పర్ణ కుటీరంలో బతకగలిగితే ఎంత ఆనందమో... మనిషి ప్రకృతి నుండి దూరమై పట్టణాల్లోకి, నగరాల్లోకి ఎందుకు పారిపోతుంటారు నాన్నా! పట్టణాల్లో, నగరాల్లో నిజంగా స్వేచ్ఛ ఉందా? అంతా పరుగు పందెం... నగరాల్లో జీవిస్తున్నది నిజంగా సుఖమేనా?" అకస్మాత్తుగా గుర్తొచ్చినట్టుగా అడిగింది లెక్చరర్ మానస.

కారు సాఫీగా రోడ్డు మీద పరుగెడుతోంది. ప్రిన్సిపాల్ రామచంద్రయ్య గారికి కారు ఎలా డ్రైవ్ చేస్తే బాగుంటుందో తెలిసిన డ్రైవర్ సుత్తిమెత్తగా స్పీడ్‌గానే పోనిస్తున్నాడు. పాత స్నేహితుడి ఫంక్షన్‌కు అడవులు, కొండలు దాటి కారులో పోవడం రామచంద్రయ్యకు సంతోషంగా వుంది. ప్రకృతి, పరిసరాలు, కారు ప్రయాణం మాధవికి, మానసకి కూడా చాలా హాయిగా వుంది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు. చుట్టూ పొలాలు... పెరళ్లు... దూరాన కొండలు... కొండలన్నీ పచ్చగా వనంలా... ఆకాశంలో పక్షుల కిలకిలలు...

ఎడం వైపు నుండి నది ప్రశాంతంగా ప్రవహిస్తోంది. చల్లని ఇసుక ముద్దాడాలనిపిస్తోంది. పిచ్చుక గూళ్ళు కట్టాలనిపిస్తోంది. ఆకాశంలో మేఘాలు దూదిలా పరుగెడుతున్నాయి. మానస ప్రకృతిలో లీనమైపోయింది. ఏదో పెళ్లికి వెళ్లి వస్తున్నట్టున్నారు వాళ్లు.

"మానసా! దూరం నుంచి ప్రేక్షకులుగా చూసి ఆనందించడానికి, ఇక్కడే ఉండిపోవడానికి చాలా తేడా ఉంటుంది. ఆ తేడా నాకు తెలుసు. ఆ తేడాను నువ్వు ఊహించలేవు. మాటవరసకు ఊహించు. కారులో ఇప్పుడు ఇక్కడే దించేస్తా. సాయంత్రం దాకా వుండి ఏ బస్సో పట్టుకొని ఏ రాత్రో ఇంటికి వస్తావా?" అన్నాడు తండ్రి రామచంద్రయ్య.

"అమ్మో ఒక్కదాన్నే! నాకు భయం... కావాలంటే అందరం దిగుదాం..." అంది మానస.

"చూశావా మానసా! ప్రకృతి అంటే నీకు ఎంతో ప్రేమ. కానీ అదే ప్రకృతిలో ఏకాంతంగా జీవించడం అంటే ఎంత భయం? మనిషికి స్వేచ్ఛంటే ఎంత భయమో!" నవ్వాడు ప్రిన్సిపాల్ రామచంద్రయ్య.

"పెళ్ళి, సంసారం, ఉద్యోగం, మొదలైన బాధ్యతలు కూడా అంతే! వాటి నుండి స్వేచ్ఛగా ఉండాలనిపిస్తుంది. కానీ భయం. అభద్రత. అవన్నీ రక్షణ అని ఫీలవుతుంటాం. అవే అప్పుడప్పుడు బంధాలని బాధపడుతుంటాం. ఒక్కోసారి వాటిల్లో స్వేచ్ఛను వెతుక్కుంటాం. నిజానికి స్వేచ్ఛను ప్రేమించే మనిషికి స్వేచ్ఛ అంటే చాలా భయం. వేలయేళ్లనాటి నుండి మనుషులు స్వేచ్ఛను ప్రేమించారు. ప్రకృతిని ప్రేమించారు. పారిశ్రామిక విప్లవం వచ్చాక ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడ్డాక మనిషి ప్రకృతికి దూరమవుతూ వచ్చాడు. నేటి మానవుడు ప్రకృతిని ప్రేమిస్తాడు. కానీ సమాజాన్ని అంతకన్నా ఎక్కువ ప్రేమిస్తాడు. సమాజంలోనే భద్రత, రక్షణ, ఉపాధి, ఉద్యోగం, సౌఖ్యాలు ఉంటాయని భావిస్తాడు. అందుకే అప్పుడప్పుడు ప్రకృతిలోకి ఆటవిడుపులాగా వెళ్లాలనుకుంటాడు. హాలీడే రిసార్ట్స్, హాలీడే టూర్స్ వేసుకుంటారు. అంతే తప్ప మన పూర్వీకుల్లా ప్రకృతితో, పశుపక్ష్యాదులతో, జంతువులతో సహవాసం చేస్తూ, సహజీవనం చేసే ప్రకృతి జీవనాన్ని ఇష్టపడరు. అందుకే నేటి మనిషికి నిజమైన, స్వచ్ఛమైన స్వేచ్ఛ అంటే భయం అనుకుంటాను." అని చెప్పాలనుకున్నాడు రామచంద్రయ్య. జిడ్డు కృష్ణమూర్తి స్వేచ్ఛ గురించి చెప్పింది పూర్తిగా సత్యమో కాదో తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయాడు.

"ఈ మాటను నేను అంగీకరించను నాన్నా! ఎన్ని చెప్పండి... మనిషి స్వేచ్ఛను ప్రేమిస్తాడు నాన్నా! స్వేచ్ఛ కోసం అన్నిటినీ వదులుకుంటాడు." అంటూ వాదించింది మానస.

''మానసా...! స్వేచ్ఛ అనేది సాపేక్షికమైనది. సమాజంలో భాగంగా స్వేచ్ఛ అనేది నిర్వచించబడుతుంది."

"నాన్నా! పెళ్లయ్యాక ఆడవాళ్లకు స్వేచ్ఛ ఎక్కడిది? అలా అని మీ అల్లుడు సుధాకర్ చెడ్డవాడేమీ కాదు. ఇతరులతో పోలిస్తే చాలా మంచివాడు. కానీ ఈ కుటుంబ వ్యవస్థలో స్త్రీలకు స్వేచ్ఛ లేదు. నాకు ఉద్యోగం చేయాలని ఉంటుంది. ఆయన ఆర్డీవోగా బిజీ. ఇద్దరికీ పని.. పని.. పని.. స్వేచ్ఛ అంటూ ఎక్కడుంది? రైల్‌లో ప్రయాణించినట్టే జీవితం పట్టాల మీద తన తోవలో సాగిపోతోంది." అంది మానస.

"నాకు మాత్రం స్వేచ్ఛ ఎక్కడిదే? పెళ్లి కావడంతోనే నా స్వేచ్ఛ హరించింది. అమ్మకు అనుకూలంగా నేను, నాకు అనుకూలంగా అమ్మ జీవించడమే లక్ష్యం అయిపోయింది. అలా పెళ్లి కావడంతోనే నేను, మీ అమ్మ స్వేచ్ఛ నుండి విముక్తుల మయ్యాం. ఒకరికొకరు మరొకరు రాజీపడుతూ పరస్పరం అర్థం చేసుకుంటూ వ్యక్తిగత స్వేచ్ఛను త్యాగం చేశాం. జీవితం అంతా మీ కోసం, అమ్మ కోసం బతకాల్సి వచ్చింది. పెళ్లయ్యాక ఎవరైనా ఇంతే. నాకూ అమ్మకు మాకంటూ వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కడ మిగిలింది? మనందరి బాగోగుల కోసం అమ్మ తన స్వేచ్ఛను వదులుకుంది. అలా పెళ్లి అంటూ అయ్యాక, కుటుంబం అంటూ ఏర్పడి పిల్లలయ్యాక కుటుంబానికే అంకితమయ్యాం. అలా ఇద్దరం స్వేచ్ఛ నుండి విముక్తమయ్యాం. నీవు అంతే. మీ ఆయనకు మాత్రం స్వేచ్ఛ ఉందా? మీ ఆయన నా ఆస్తి అని అంటుంటావు కదనే..."

"అమ్మ కూడా నిన్ను తన ఆస్తి లాగానే భద్రంగా చూసుకుంటుంది. బెదిరిస్తుంది కదా!" నవ్వింది మానస.

తల్లి మాధవికి ఆ చర్చ ఇంకా వినాలని వుంది.

"నాకు స్వేచ్ఛ ఎక్కడిదే? చిన్నప్పుడు అమ్మా, నాన్నలు, పెళ్లయ్యాక నాన్న, ఆ తర్వాత మీరు... అందరూ నన్ను కట్టడి చేసిన వాళ్లే. జీవితమంతా మీకు సేవ చేయడానికే సరిపోయింది." అంటూ తన ఆవేదనను వెళ్లగక్కింది మాధవి.

స్వేచ్ఛ మీద, దాని భిన్న కోణాల మీద తండ్రి వివరిస్తుంటే కూతురు మానస ఇంకా తెలుసుకోవాలని అడుగుతోంది.

"అయితే మానసా! అమ్మ స్వేచ్ఛను భరించలేదు. నీలాంటి స్త్రీలు కూడా స్వేచ్ఛను భరించలేరురా! డిపెండెంట్‌గా ఉండడంలోనే ఆనందాన్ని, భద్రతను, సుఖాన్ని కోరుకుంటారు" అన్నాడు రామచంద్రయ్య.

"అది నీ చాదస్తం నాన్నా! నేను స్వేచ్ఛను చాలా ప్రేమిస్తాను. అమ్మలాగా కాదు" అంది. మానసకి ఉక్రోషం ముంచుకొచ్చింది.

''అయితే నువ్వు పెళ్ళెందుకు చేసుకున్నావో చెప్పగలవా?" నవ్వుతూనే నిలదీశాడు తండ్రి రామచంద్రయ్య.

తల్లి మాధవి కల్పించుకుని "అదేం మాట? పెళ్ళి ఆడదానికి కట్టుకొయ్య. ఎంత తిరిగినా దాని చుట్టే తిరగాలి." కోపంగా అంది.

"అలా ఎందుకమ్మా? తనకు ఇష్టం లేని బతుకు బతకాల్సి వచ్చినప్పుడు విడాకులు తీసుకోచ్చుగా!" అంది లెక్చరర్ మానస.

"మేం విడాకులు తీసుకుంటే మీరు ఎట్లా బతుకుదురే! అటు నాన్న ప్రేమ కోల్పోయి, ఇటు అమ్మ సాదలేక ఎంత కష్టం?" వివరించింది తల్లి మాధవి.

రాత్రంతా నిలకడగా కురిసిన వర్షం తెల్లవారే సరికి వరదలైంది. నిండిన చెరువులు మత్తడి నుండి నీరు ఇంకా పెరిగి చెరువు కట్టలు తెగిపోతున్నాయి. ఎక్కడి చెరువు అక్కడ తెగుతుంటే ఆ నీళ్ళన్నీ కింది చెరువులో పడి కింది చెరువులు కూడా కట్టలు తెగుతున్నాయి.

"అమ్మా! అది నీ సమస్య! ఇప్పుడు నాలాగా ఎంతోమంది సొంత కాళ్లమీద బతుకుతున్నారు. మగవాళ్లలాగానే ఉద్యోగాలు చేస్తున్నారు. మళ్లీ ఇంటిపని, పిల్లల పెంపకం కూడా చూసుకుంటున్నారు."

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కి పడింది మాధవి. కారులో యోగ నిద్రలో లాగా ఉండిపోయిన రామచంద్రయ్య అకస్మాత్తుగా కళ్ళు తెరిచాడు.

"జయకేమైనా పిచ్చి పట్టిందా? ఇలాంటి ఆలోచనలేమిటే" అంది మాధవి.

"అమ్మా! నీకెందుకు జీవితమంతా స్వేచ్ఛ లేదనిపించిందో జయకు అదే అనిపిస్తోంది. ఇక్కడ మంచి, చెడ్డల గురించి కాదమ్మా! జయకు స్వేచ్ఛ కావాలి. స్వేచ్ఛ కోసం జయ సింగిల్ పేరెంట్‌గా పిల్లలతో కలిసి బతకాలనుకుంటున్నది! ఆమె ఆలోచనలో ఏమైనా పొరపాటు వుందా? పెళ్ళి, కుటుంబం, పిల్లలు అంటే ఏంటో కాస్త అనుభవం అయ్యింది. పెళ్ళి కాకముందే ఏవో కొన్ని భ్రమలు వుండేవి. కొన్ని ఆశలు ఉండేవి. ఏదో సాధిస్తామని అనుకుంటారు. ఈ కుటుంబ వ్యవస్థలో ఎవరికీ స్వేచ్ఛ లేదు నాన్నా!"

"మానసా! జయకు విడాకులతో స్వేచ్ఛ లభిస్తుందా? అది నిజంగా స్వేచ్ఛేనా? పెళ్ళి కాకముందటి స్వేచ్ఛ వేరు... పెళ్ళయ్యాక విడాకులు తీసుకుంటే వుండే పరిస్థితి వేరు. ఈ రెండూ ఒకటి కాదు. ఆ విషయం జయకు అర్థమైందా?'' అన్నాడు రామచంద్రయ్య.

"అంటే జయ నిజంగానే విడాకులు తీసుకుంటుందా?" అంటూ ఆశ్చర్యపోయింది మాధవి. "అసలు ఏం జరిగింది?" అంటూ మానసకేసి చూసింది.

"సంసారం అంటే విసుగొచ్చిందట" అసలు విషయం చెప్పకుండా గుంభనంగా ఉండిపోయింది మానస.

"మాధవీ! పెళ్ళయ్యాక బతుకంతా మందికోసమే బతికాను. నాదంటూ ఏముంది అన్నావు. గుర్తుందా?" మానస వైపు చూస్తూ మళ్ళీ అన్నాడు.

"మానసా! సరిగ్గా పెళ్లయి పిల్లలు పుట్టిన తర్వాత కొంతకాలానికి అంటే, పెళ్ళయ్యాక పదేళ్ళకు నాక్కూడా ఈ పెళ్లి, సంసారం, జంజాటం, జీవితంలో పరుగు పందెం నుండి పారిపోవాల నిపించింది. నాకూ స్వేచ్ఛ కావాలనిపిం చింది. నా మిత్రుడు ఒకాయన అలాగే భార్యా, పిల్లల్ని వదిలేసి సమాజం కోసం అంటూ వెళ్ళిపోయాడు. మరొకాయన స్వేచ్ఛ, తపస్సు, ధాన్యం అంటూ హిమాలయాలకు వెళ్ళిపోయాడు. ఇద్దరూ కొంతకాలం తర్వాత మళ్ళీ ఏమైందో ఏమోగానీ కుటుంబాలను వెతుక్కుంటూ వచ్చారు. అప్పటికి వాళ్ళ కుటుంబాలు చిన్నాభిన్నమై పోయాయి. వాళ్ళపిల్లలు, భార్య బతుకు అంతా ఛిద్రమైపోయింది. వాళ్ళ స్వభావాలు మారిపోయాయి. ఎంత చేసినా నువ్వు నాకోసం బతకడం లేదు. మాకోసం రాలేదు. నీ కోసమే వచ్చావు. మాపై నీకు ప్రేమలేదు. ప్రేమ ఉంటే మమ్మల్నందర్నీ కష్టాల్లో వదిలేసి వెళ్ళిపోయేవాడివా? అంటూ నిరంతరం వాదించే వాళ్ళు. చిత్రహింస పెట్టేవాళ్ళు...

"ఎంత చేసినా వాళ్ళ త్యాగానికి, సేవకు గుర్తింపు లేకుండా పోయింది. వాళ్ళు తమ స్వేచ్ఛను, లక్ష్యాలను, ఆశలను వదులుకొని లేదా రాజీ పడి జీవితమంతా వారికే అంకితం చేశారు. వాళ్ళు బాగా చదువుకొని ఎదగాలని ఎన్నో త్యాగాలు చేశారు. వాళ్లు వున్నతంగా ఎదిగారు. యూకే, యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, న్యూజిలాండ్ వంటి దేశాలకు వెళ్ళారు. అక్కడే స్థిరపడ్డారు. అయినా ఇప్పటికీ వాళ్ళు వాళ్ళ నాన్నల్ని విమర్శిస్తూనే వున్నారు. క్షమించడం లేదు. కుటుంబంలో వాళ్ళు స్వేచ్ఛను కోరుకున్నారు. ఎందుకో మళ్ళీ తిరిగి కుటుంబానికి ఆధారమయ్యారు. అయినా వారిని భార్యగానీ, పిల్లలు గానీ క్షమించలేక పోయారు...

"నాన్నా! నువ్వేమంటున్నావో నాకు అర్థం కావడం లేదు. అటు అమ్మ స్వేచ్ఛగా బతకలేదని గుర్తు చేస్తావు. జయ విడాకులు తీసుకుంటానంటే అది స్వేచ్ఛేనా అంటావు." అని ప్రశ్నల వర్షం కురిపించింది మానస.

"మానసా! రేపు సింగిల్ పేరెంట్‌గా జయ, పిల్లలను పెంచి పోషించినా నాన్నకు దూరమయ్యామని జయను ఆమె పిల్లలు క్షమిస్తారా? ఆలోచించు. జయ మరో పెళ్ళి చేసుకున్నా... లేదా మళ్ళీ రాజీపడి కొంతకాలం తర్వాత ఇతనితోనే కలిసి జీవించాలనుకున్నా జయ పిల్లలుగానీ, భర్తగానీ జయ ఎంతసేవ చేసినా, ఎంత త్యాగం చేసినా జయను గుర్తిస్తారా? క్షమిస్తారా? ఆలోచించుకో... పెళ్ళికాకముందు ఉండే స్వేచ్ఛ వేరు. పెళ్ళయ్యాక కుటుంబాన్ని వదిలి వెళ్ళిపోవడంలో, విడాకులు తీసుకోవడంలో వుండే స్వేచ్ఛ వేరు. ఈ రెండూ ఒకటి కాదు. బ్రహ్మచారిగా జీవితాంతం స్వేచ్ఛగా పెళ్ళిలేకుండా జీవించే స్వేచ్ఛ ఎవరికైనా ఉంది. కానీ పెళ్ళయ్యాక అలాంటి స్వేచ్ఛ కోరుకుంటే ఈ సమాజం ఎలా భావిస్తుందో మా మిత్రుల బతుకును చూశావుగా! ఆ మిత్రులెవరో నీకు తెలుసు గదా!"

మాధవికి ఆ మిత్రుల గురించి బాగా తెలుసు. వాళ్ళ భార్యలు వాళ్లను ఎలా ఎంత రాచి రంపాన పెడుతున్నారో కూడా తెలుసు. వాళ్ళు గుర్తొచ్చినప్పుడల్లా మాధవి వాళ్ళు ఎందుకు అలా మారారో... గడిచిపోయిన గతాన్ని ప్రతిసారి గుర్తు చేసుకుంటూ నిరంతరం నరకాన్ని ఎందుకు సృష్టించుకుంటారో అర్థం కాదు. ఎన్నిసార్లు చెప్పినా... ఎంతమంది చెప్పినా... వారి స్వభావాలు మారడం లేదు. నాన్న నుండి అన్నీ పొంది కూడా నాన్నకు నిరంతరం నరకం చూపిస్తున్నారు.

ఈ విషయాలు మాధవికి, మానసకి బాగా తెలుసు. కాసేపాగి మళ్లీ అన్నాడు రామచంద్రయ్య.

"ఇప్పటికీ ఎవరూ ఫోన్ చేయరు. మాట్లాడరు. అమ్మతోనే అన్నీ మాట్లాడుకుంటారు. ఆ కుటుంబాలకు నాన్నలు బయటి వ్యక్తులు. ఎన్నడూ నాన్నను వాళ్ళు లెక్కలోకి తీసుకోలేదు. కానీ నాన్న లేకుండా వారి అభివృద్ధి లేదు. ఎందుకీ పెరడాక్స్! మనిషి ఎదిగిన కొద్దీ తన వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని, సంస్కారాన్ని ఎదిగించుకుంటారని అంటారు. కానీ వాళ్ళు ఎంత ఎదిగినా గతం పట్ల, జ్ఞాపకాల పట్ల, నాన్న పట్ల ఇలా ఎందుకు ప్రవర్తిస్తారు? ఇలాంటి జీవితమేనా జయ కోరుకునేది? జయ భర్త వద్ద పిల్లల్ని వదిలేసినా వాళ్ళు ఎదిగిన తర్వాత జయ పట్లయినా, వాళ్ల నాన్న పట్లయినా ద్వేషంతో ప్రవర్తించరని చెప్పగలవా? అమ్మా, నాన్నల ప్రేమ కోల్పోయామని సమాజంలో ఆ విషయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నామని నిరంతరం జయను విమర్శించరా? దాన్ని తట్టుకోవడానికి జయ సిద్ధంగా వుందా? అలా విమర్శించినా, ద్వేషించినా వాళ్ళను పెంచి పోషించడం నా కర్తవ్యం అని భావిస్తూ జయ స్వేచ్ఛను అనుభవించగలదా?'' రామచంద్రయ్య కూతురి అభిప్రాయం కోసం వెనక్కి చూశాడు.

కారు వేగంగా నడుస్తూనే ఉంది. ఏదో కుదుపులో కారు స్లో అయ్యింది.

మానస ఆలోచిస్తోంది. నాన్న జయను విడాకులు తీసుకోమంటున్నాడో.. వద్దంటున్నాడో తెలియడం లేదు. ఏదో ఒకటి స్పష్టంగా చెబితే బాగుండేది.

మనిషి స్వేచ్ఛా జీవి కాదు. మనిషి సంఘ జీవి. మనిషి సంఘంలో ఉంటూ స్వేచ్ఛను కోరుకుంటాడు. అంతేగానీ మనిషి స్వేచ్ఛగా ప్రకృతిలో విడిగా మనలేడు. సంఘ జీవితంలో ఏవో బంధాలు, బంధనాలు... ఆ అనుబంధాల్లో బందీగా బతకడమే కొందరికి ఇష్టం. అనుబంధాలన్నీ స్వేచ్ఛ నుండి పారిపోవడానికా? స్వేచ్ఛ అంటే ఏమిటి? ఆకాశంలో ఎగిరే పక్షికి నిజంగా స్వేచ్ఛ ఉందా? అది స్వేచ్ఛేనా? ఆహారం అన్వేషణా? అనివార్యతనా? అనివార్యత నుండి పారిపోవడమే స్వేచ్ఛా?

ఇంకా లోతుగా ఆలోచించుకోమన్నట్టు.. "నేను చిన్నప్పుడు నాన్న దెబ్బలకు భయపడి చిన్నమ్మ ఇంటికి పారిపోయిన. నా దృష్టిలో అది నిర్బంధం నుండి స్వేచ్ఛ కోసం పారిపోవడం. అమ్మా, నాన్నల దృష్టిలో నేను క్రమశిక్షణ నుండి పారిపోవడం." అన్నాడు రామచంద్రయ్య.

తండ్రీ, కూతుళ్ల చర్చలో అనేక విషయాలు దొర్లిపోయాయి.

నది స్వేచ్ఛకు నిదర్శనమా?

నదికి స్వేచ్ఛ ఉందా?

అమ్మ ఒక నది.

మహిళ ఒక నది.

అమ్మకు స్వేచ్ఛ ఉందా?

''చర్య ప్రతిచర్యలకు అతీతంగా ప్రకృతిలో జీవించడమే స్వేచ్ఛా?

స్వేచ్ఛగా జీవించేటప్పుడు ప్రకృతి చర్య ప్రతిచర్యలు జరపడం లేదని అనుకోవడం సరైందేనా?

మనిషి ఒక వృక్షంలాగా ఎదిగాననుకుంటాడు. కానీ తీగలా అల్లుకోవాలనుకుంటాడు.

ఇల్లాలిగా, తల్లిగా బతకడాన్ని ఫెమినిస్టులు డిపెండెంట్ సైకాలజీ అన్నారు. అది వాస్తవమే.

కానీ వాళ్ళు ఎందుకోసం డిపెండెంట్‌గా బతుకుతున్నారు? కేవలం ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం వల్లనేనా?

కేవలం నిర్ణయ స్వేచ్ఛ లేకపోవడం వల్లనేనా?

ఒక్కసారైనా ఆలోచించు.

అమ్మ స్వేచ్ఛ కోల్పోయిందా? స్వేచ్ఛ నుండి విముక్తమైందా?

స్వేచ్ఛ కావాలనుకున్నప్పుడు తిరుగుబాటు చేస్తారు.

స్వేచ్ఛ అంటే స్వీయ నిర్ణయ స్వేచ్ఛ అనుకున్నప్పుడు అది స్వార్థంలో భాగం కాకుండా ఉంటుందా?

"నీకంటూ ఏ కోరికలు లేని దశలో జీవిస్తే అది నిజమైన స్వేచ్ఛ. స్వేచ్ఛగా బతకాలనుకుంటే తనదైన స్వార్థం నుండి బయటపడాలి. స్వేచ్ఛ నుండి విముక్తి కావడం అంటే స్వార్థం నుండి విముక్తం కావడం."

సబ్జెక్టివ్ థింకింగ్‌లో వుండే స్వేచ్ఛ స్వీయ మానసిక ధోరణికి సంబంధించిన స్వేచ్ఛ కాదా?

సమస్త భవ, భావ బంధాల నుండి, రక్త సంబంధాల నుండి స్వేచ్ఛ పొందినప్పుడే నిజమైన స్వేచ్ఛ. అది సాధ్యమేనా?" అంటూ రామచంద్రయ్య అనేక ప్రశ్నలు సంధించాడు. ఆ ప్రశ్నల పరంపరకు మానస విస్తు పోయింది. ఒక్కొక్క ప్రశ్న ఒక్కొక్క బాణంలా గుచ్చుకుంటోంది.

స్వేచ్ఛ అంటే సమాధి దశనట! సమాధి అంటే ఏమిటి?

భవ భావ బంధాలకు, అనుబంధాలకు అతీత స్థితిలో జీవించడమే సమాధి అట!

"మానసా! ఆ సమాధి దశ ఎవరి కోసం? ఎందు కోసం? స్వీయ ఆనందం కోసమేనా? ఆత్మానందమే పరమావధి అయితే వారితో సమాజానికి ఏం సంబంధం? వారికి సమాజంతో ఏం పని? సమాజానికి వారితో ఏం పని? సమాజం వారి గురించి ఎందుకు పట్టించుకోవాలి? ఎందుకు ఆలోచించాలి?"

మానస వయస్సుకు ఆ ప్రశ్నలు అర్థం కావడం లేదు. రామచంద్రయ్య అదేమీ గమనించినట్టు లేదు. ఇంకా ఏదో చెబుతూనే వున్నాడు.

సంబంధంలో స్వేచ్ఛ.. అనుబంధంలో స్వేచ్ఛ... నిర్బంధంలో స్వేచ్ఛ... ఉద్యోగంలో స్వేచ్ఛ... పెళ్లిలో స్వేచ్ఛ... కుటుంబంలో స్వేచ్ఛ... స్వచ్ఛందంగా, స్వార్థ రహితంగా జీవించే జీవితంలో స్వేచ్ఛ నిజమైన స్వేచ్ఛ.

కేవల ఆత్మానందం స్వార్థ రహిత అనందం ఎలా అవుతుంది? అనే ప్రశ్నలు మరీ అహాన్ని బల్లెంతో పొడిచినట్టుగా అన్పించింది. మనిషి ఏ అడ్డంకులు లేకుండా తనలోని సృజనాత్మకతను, విశిష్టతను, ప్రత్యేకతను, ఆసక్తిని గమనించి దాన్నను సరించి స్వేచ్ఛగా ఎదగాలనుకోవడం స్వార్థమా? కేవలం ఆత్మానందం అవుతుందా? ఆ మాటను భరించలేకపోయింది మానస.

"మీదంతా థాట్‌పోలీసింగ్ నాన్నా!" అంటూ ఎదురు తిరిగింది మానస.

రామచంద్రయ్య పడి పడి నవ్వాడు.

"మానసా! అడ్మినిస్ట్రేషన్ అంటేనే థాట్ ప్రాసెస్‌ని నిర్దేశించడం. సరిగ్గా చెప్పాలంటే అదంతా థాట్ పోలీసింగ్. సదికి ఆవలి గట్టు, ఈవలి గట్టు ఎలా ఉంటాయో, పరిపాలన, క్రమశిక్షణ, అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్ అనేవి అలాంటివి. రాజ్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థ, సోషలిస్టు వ్యవస్థ, రాచరికం, రాచరిక వ్యవస్థ, పారిశ్రామిక వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ మొదలైనవన్నీ సమాజంలోని సభ్యుల ఆలోచనలను తామనుకున్న విధంగా మలుస్తాయి. నిర్దేశిస్తాయి. ఎదిరిస్తే నిర్బంధం చేస్తాయి. నిర్బంధాలు ప్రయోగిస్తాయి. అప్పుడప్పుడు ప్రజలు దానిపై తిరుగుబాటు చేస్తారు. మరికొన్ని హక్కులు వస్తాయి. తిరిగి ఆయా వ్యవస్థలకు లోబడి కొనసాగాల్సి వుంటుంది...

ఇలా హెడ్మాస్టర్ అంటే పెద్ద తల. టీచర్లు ఏం చేస్తారు? మైండ్ సెట్ మారుస్తారు. లేదా మైండ్‌సెట్ రూపొందిస్తారు. ఆయా సమాజాలు తమ స్థల కాలాలను అనుసరించి వీటిని రూపొందిస్తాయి."

నిజానికి స్వేచ్ఛను ప్రేమించే మనిషికి స్వేచ్ఛ అంటే చాలా భయం. వేలయేళ్లనాటి నుండి మనుషులు స్వేచ్ఛను ప్రేమించారు. ప్రకృతిని ప్రేమించారు.

"నాన్నా! అయితే మనిషి జీవితమంతా ఏదో ఒక థాట్ పోలీసింగ్‌లో భవ భావ బంధాల్లో, కంట్రోల్లో కొనసాగుతూనే ఉంటాడా?"

"ఇప్పుడు నీకు అసలు విషయం అర్థమైందిరా. అమ్మ ఈ భవ, భావబంధాల నుండి విముక్తమైంది. స్వేచ్ఛగా జీవిస్తోంది. ఆ స్వేచ్ఛలో స్వార్థాన్ని వదులుకుంది. అలా స్వార్థపూరితమైన స్వేచ్ఛ నుండి అమ్మ విముక్తమైంది.

స్వేచ్ఛ నుండి విముక్తి అంటే స్వార్థం నుండి విముక్తి. స్వేచ్ఛ నుండి విముక్తి అంటే స్వార్థం నుండి ఆత్మానందం నుండి కూడా విముక్తి పొందిన నిస్వార్థ స్వేచ్ఛ, సార్వజనీన, సార్వకాలీన, విశ్వజనీన స్వేచ్ఛ. అదే స్వేచ్ఛ నుండి విముక్తి లేదా స్వేచ్ఛ నుండి స్వేచ్ఛ అని చెప్పవచ్చు.

స్వార్థం నుండి విముక్తమైన స్వేచ్ఛ మనిషిని ప్రేమిస్తుంది. ప్రకృతిని ప్రేమిస్తుంది.

ఇతరుల స్వేచ్ఛలో,

కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపు : ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్ , జూన్ 30:(నేటినిజం ప్రతినిధి): దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించిన అనంతరం ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య భారీగా పెరిగిందని పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ కిట్ పథకం లో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం పొందిన మహిళలకు నగదుతో పాటు కిట్ అందిస్తున్నామన్నారు.

గతంలో ప్రభుత్వ ఆసుపత్రి అంటే జంకే జనం ప్రస్తుతం క్యూ కడుతున్నారన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యాల సునీత, ఎంపీపీ బాలాజీ రావు, శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి ప్రమోద్ కుమార్, వైద్యులు శ్రీరామ్ తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, తెరాస నాయకులు, కార్యకర్తలు, గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

ఒడిషా తీరం నుంచి విజయవంతంగా అభ్యాస్- హైస్పీడ్ ఎక్స్‌పెండబుల్ ఏరియల్ టార్గట్ ప్రయోగం

న్యూఢిల్లీ, జూన్ 30: హైస్పీడ్ ఎక్సపెండబుల్ ఏరియల్ టార్గెట్ (అత్యంత వేగంగా సాగగల గగన లక్ష్యం – హెచ్ఇఎటి) – అభ్యాస్ (ఎబిహెచ్ఎఎస్)ను ఓడిషా తీరంలోని చండీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) నుంచి 29 జూన్ 2022న విజయవంతంగా పరీక్షించారు. స్థిరమైన స్థాయి, అత్యధిక విన్యాసాలు సహా తక్కువ ఎత్తులో విమానం పనితీరు ఈ ప్రయోగం సందర్భంగా ప్రదర్శితమైంది. ముందస్తుగా నిర్దేశించిన తక్కువ ఎత్తులో విమాన పథంలో భూమిపై ఉండే నియంత్రిక నుంచి లక్ష్యిత విమానాన్ని ప్రయోగించారు. దీనిని రాడార్, ఎలెక్ట్రో ఆప్టికల్ టార్గెటింగ్ వ్యవస్థ సహా ఐటిఆర్ మోహరించిన పలు అనుగామి సెన్సార్ల ద్వారా దీనిని పర్యవేక్షించారు.

అభ్యాస్‌ను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజషన్ (డిఆర్‌డిఒ)కు చెందిన ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా రూపకల్పన చేసి అభివృద్ధి చేశారు. ఈ గగన వాహనాన్ని దిగువన అమర్చిన రెండు బూస్టర్లను ఉపయోగించి ప్రయోగించారు. ఇది వాహనానం తొలి దశలో వేగంగా వెళ్ళేందుకు ఇది తోడ్పడుతుంది. అధిక సబ్‌సోనిక్ వేగంలో విమానం ఎగరడాన్ని ఎక్కువ సమయం భరించడాన్ని స్థిరపరచేందుకు చిన్న గ్యాస్ పరివర్తక (టర్బైన్) ఇంజిన్ శక్తిని అందిస్తుంది. లక్ష్యిత విమానానికి ఫ్లైట్ కంట్రోల్ కంప్యూటర్‌తో పాటుగా మైక్రో– ఎలక్ట్రోమెకానికల్ సిస్థం ఆధారిత చోదన వ్యవస్థను మార్గదర్శనానికి, నియంత్రణ కోసం అమర్చడమే కాక గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు, లక్ష్యిత విమానానికి మధ్య సంక్షిప్త సంకేత సందేశాల కోసం డాటా లింక్‌ను ప్రతి తక్కువ ఎత్తులో ఉన్న విమానానికి దేశీయ రేడియో ఆల్టిమీటర్‌ను ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో స్వీయప్రేరితంగా ఎగిరేందుకు వాహనాన్ని ప్రోగ్రాం చేశారు.

అభ్యాస్ విమాన పరీక్షను విజయవంతంగా పూర్తి చేసినందుకు రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ డిఆర్‌డిఒను, సాయుధ దళాలను, పరిశ్రమను అభినందించారు. సాయుధ దళాల గగన లక్ష్యాల అవసరాలను ఈ వ్యవస్థ నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ఈ వ్యవస్థ రూపకల్పన, అభివృద్ధి, పరీక్షకు కారణమైన బృందాల కృషిని రక్షణ శాఖ ఆర్‌డి విభాగం కార్యదర్శి, డిఆర్‌డిఒ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి ప్రశంసించారు.

జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం చంద్రబాబుకు లేదు: సజ్జల

అమరావతి, జూన్ 30: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం చంద్రబాబుకు లేదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అందుకే రోజూ ఏదో ఒక అబద్ధం చెప్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నరని మండిపడ్డారు. తక్షణమే జగన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దించేయాలని దుష్టచతుష్టయం కుట్రలు పన్నుతున్నదన్నారు. అధికారం లేకపోవడంతో చంద్రబాబుతో పాటు ఈ పచ్చ మీడియా కూడా నిలబడలేకపోతున్నాయని గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు.

సీఆర్డీఏ భూముల విక్రయాలంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అబద్ధాలను నిజమంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని సజ్జల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మసి బూసి మారేడుకాయ చేయాలని గట్టిగా ముందుకెళ్తున్నారని చెప్పారు. చంద్రబాబుకు అధికారం లేదన్న బాధ, దుగ్ధ, విరహంతో పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారం మరెక్కడా చూసి ఉండరన్నారు. తాను అధికారంలో లేనన్న ఆక్రోశంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వ్యవస్థనే నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతి రాజధానిగా ఉండదని తమ పార్టీ రాజకీయంగా తీసుకున్న నిర్ణయమని, అధికార వికేంద్రీకరణను దృష్టిలో పెట్టుకుని మూడు రాజధానులను ఏర్పాటుకు నిర్ణయించామని చెప్పారు.

ఐదు బొగ్గు గనుల పిట్‌లేక్స్‌ను రామ్‌సర్ జాబితాలో చేర్చడానికి పర్యావరణ మంత్రిత్వ శాఖను బొగ్గు మంత్రిత్వ శాఖ సంప్రదించింది

న్యూఢిల్లీ, జూన్ 30:బొగ్గు ఉత్పత్తిని మరింత పెంపొందించడం ద్వారా రోజురోజుకు పెరుగుతున్న ఇంధన డిమాండ్లను నెరవేర్చడానికి భారతదేశ బొగ్గు రంగం నిరంతర ప్రయత్నాలు చేస్తోంది. అదే సమయంలో పర్యావరణ సంరక్షణ, అడవులు మరియు జీవవైవిధ్యాన్ని పరిరక్షించే చర్యలకు ప్రాధాన్యతనిస్తూ స్థిరమైన అభివృద్ధి మార్గాన్ని అనుసరించే దిశగా బొగ్గు రంగం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వివిధ సుస్థిర కార్యకలాపాలలో భాగంగా కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) పర్యావరణ, అటవీ డ వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్‌సీసీ) మరియు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బొగ్గు గని పిట్ సరస్సుల పరిరక్షణ, తడి భూముల పర్యావరణ స్వభావ నిర్వహణ ప్రతిష్టాత్మక రామ్‌సార్ జాబితాలో అటువంటి పిట్ సరస్సులను చేర్చడం వంటి కార్యక్రమాలను చేపట్టింది.రామ్‌సర్ జాబితాలో చేర్చడానికి బొగ్గు గని పిట్ సరస్సుల అనుకూలత గురించి రామ్‌సార్ జాబితాలో ఉంచడానికి తడి భూములను గుర్తించడానికి నోడల్ మంత్రిత్వ శాఖ ఎంఓఈఎఫ్‌సీసీతో చర్చించబడింది. ఎంఓఈఎఫ్‌సీసీ మార్గదర్శకం ప్రకారం పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రామ్‌సర్ జాబితాలో చేర్చే పరిశీలన కోసం సీఐఎల్ ఐదు పిట్ సరస్సులను గుర్తించింది. సీఐఎల్ రామ్‌సార్ ఇన్ఫర్మేషన్ షీట్ (ఆర్ఐఎస్)ని సిద్ధం చేసే పనిలో ఉంది. ఈ గని పిట్ వాటర్ బాడీలను వివిధ జాతుల పక్షులు క్రమం తప్పకుండా సందర్శిస్తాయి మరియు అవి జంతువుల జనాభాను కూడా కలిగి ఉంటాయి. పెద్ద ఎత్తున ప్లాంటేషన్ మరియు ఇతర నేల తేమ పరిరక్షణ కార్యకలాపాల ద్వారా సీఐఎల్ ప్రయత్నాల కారణంగా ఈ నీటి వనరుల చుట్టూ ఉన్న పర్యావరణం మెరుగుపడింది.

పాడుబడిన గని సైట్‌లను సురక్షితంగా పర్యావరణపరంగా స్థిరంగా మరియు తగిన వాణిజ్య వినియోగానికి అనువైనదిగా మార్చడానికి వాటిని పునర్నిర్మించడానికి ప్రపంచ బ్యాంక్, జీఐజడ్ మరియు ఇతర ప్రపంచ సంస్థల మద్దతు మరియు సహాయాన్ని బొగ్గు మంత్రిత్వ శాఖ పొందుతోంది. తద్వారా సోలార్ పార్కులు, టూరిజం, క్రీడలు, అటవీ, వ్యవసాయం, ఉద్యానవనం, టౌన్‌షిప్‌లు మొదలైన ఆర్థిక వినియోగం కోసం తిరిగి స్వాధీనం చేసుకున్న భూములు పునర్నిర్మించబడతాయి. వివిధ దేశాలలో గనుల మూసివేత కేసులను నిర్వహించడంలో ఈ సంస్థల యొక్క అపారమైన అనుభవం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది మరియు అత్యుత్తమ గ్లోబల్ దత్తత తీసుకోవడానికి దోహదపడుతుంది.

పశ్చిమ భారతదేశంలోకి అడుగుపెట్టిన చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే

న్యూఢిల్లీ, జూన్ 30:మొట్టమొదటి చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలే ఈరోజు ఉదయం జైపూర్‌కు చేరుకుంది. దీంతో టార్చ్ రిలే పశ్చిమ భారతదేశంలోకి అడుగుపెట్టినట్టయింది. అజ్మీర్ దాటిన తర్వాత, టార్చ్ రిలే అహ్మదాబాద్‌లోకి ప్రవేశించి, కెవాడియా, వడోదరా, సూరత్, దండి, డామన్, నాగ్‌పూర్, పుణే, పంజిమ్ నగరాలలోకి ప్రయాణిస్తుంది. ఆ తర్వాత టార్చ్ రిలే భారతదేశం యొక్క తూర్పు భాగంలోకి ప్రవేశిస్తుంది, ఆ తరువాత ఈశాన్య భారతదేశం, దక్షిణ భారతదేశానికి చేరుకుంటుంది. ఈ టార్చ్ తొలిసారిగా ఉత్తర భారతదేశం నుంచి తన యాత్రను ప్రారంబించింది. ఆ తరువాత గత 10 రోజులలో ఢిల్లీ, జమ్మూ మరియు కాశ్మీర్, హిమాచల్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్ మరియు రాజస్థాన్‌లోని 20 నగరాలగుండా ప్రయాణించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల జ్ఞాపకార్థంగా జరుగుతున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌కు వేడుకలకు గుర్తుగా ఈ టార్చ్ రిలే మొత్తం 75 నగరాలకు వెళుతుంది.

ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రారంభం..

ఈ చెస్ ఒలింపియాడ్ కోసం మొట్టమొదటి టార్చ్ రిలేను భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జూన్ 19, 2022న న్యూఢిల్లీలోని ఐజీ స్టేడియంలో ప్రారంభించారు. ఎఫ్ఐడీఈ అధ్యక్షుడు ఆర్కాడీ డ్వోర్కోవిచ్ టార్చ్‌ను ప్రధానికి అందజేయగా, ఆయన దానిని భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌కు అందజేశారు. చారిత్రాత్మక ప్రయోగం తరువాత, ఈ టార్చ్ దేశ రాజధానిలోని ఎర్రకోట, ధర్మశాలలోని హెచ్‌పీసీఏ, అమృత్‌సర్‌లోని అట్టారీ సరిహద్దు, ఆగ్రాలోని తాజ్ మహల్ మరియు లక్నోలోని విధానసభతో సహా ప్రముఖ ప్రదేశాలలో ప్రయాణించింది. జమ్మూ కాశ్మీర్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, పంజాబ్ గవర్నర్ శ్రీ బన్వరీలాల్ పురోహిత్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్, కేంద్ర న్యాయ మరియు న్యాయ శాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజు వంటి ప్రముఖులు చెస్ ఒలింపియాడ్ టార్చ్ రిలేకు సంబంధించిన వివిధ ఈవెంట్‌లలో పాల్గొన్నారు. టార్చ్ రిలే ఈవెంట్‌లు సిమల్ చెస్‌తో ప్రారంభమవుతాయి, ఇందేలో గ్రాండ్‌మాస్టర్‌లు, ప్రముఖులు స్థానిక క్రీడాకారులతో గేమ్ ఆడతారు. ఆ తరువాత టార్చ్ జీప్ ద్వారా వివిధ ప్రదేశాలకు ప్రయాణిస్తుంది. అంతేకాకుండా, ఒక నగరం నుండి మరొక నగరానికి ప్రయాణించే ఇంటరాక్టివ్ బస్ టూర్, యువ చెస్ ప్లేయర్స్ కమ్యూనిటీని కలిగి ఉన్న ప్రాంతం నుండి ప్రాంతానికి మారుతూ ఉండే సాంస్కృతిక కవాతుతో సహా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

ప్రతిష్టాత్మక ఈ పోటీ చరిత్రలో మొదటి సారిగా భారతదేశం 44వ ఎఫ్ఐడీఈ చెస్ ఒలింపియాడ్‌ను నిర్వహించడమే కాకుండా, 1927 ఏడాదిలో ప్రారంభమైన ఎఫ్ఐడీఈ పోటీ చరిత్రలో మొదటి సారిగా టార్చ్ రిలేను ప్రారంభించిన మొదటి దేశం కూడా భారత దేశమే కావడం విశేషం. ఈ పోటీని నిర్వహిస్తున్న భారతదేశం 44వ ఎఫ్ఐడీఈ చెస్ ఒలింపియాడ్‌లో 20 మంది ఆటగాళ్లను రంగంలోకి తన వంతుకు రంగంలోకి దింపడానికి సిద్ధంగా ఉంది. ఓపెన్ మరియు మహిళల విభాగంలో భారత్‌కు 2 జట్లను బరిలోకి దింపేందుకు అర్హత ఉంది. చెస్ ఒలింపియాడ్ చరిత్రలో అత్యధికంగా 188 దేశాల నుండి 2000 మందిఈ ఈవెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 44వ ఎఫ్ఐడీఈ చెస్ ఒలింపియాడ్ చెన్నైలో జూలై 28 నుండి ఆగస్టు 10, 2022 వరకు జరుగుతుంది.

2021-22 ఆర్థిక సంవత్సరానికి 30% వృద్ధితో అత్యధిక స్థాయిలో రూ. 57,586.48 కోట్లకు చేరిన మనదేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు

న్యూఢిల్లీ, జూన్ 30:భారతదేశం 2021-22 ఎగుమతుల్లో భారీ అసమానతలు ఉన్నప్పటికీ రూ. 57,586.48 కోట్ల (7.76 బిలియన్ డాలర్ల) విలువైన 13,69,264 మెట్రిక్ టన్నుల సముద్ర ఆహారాన్ని రవాణా చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరం ఎగుమతుల్లో రూపాయి పరంగా 31.71%, డాలర్ మారకంగా 30.26% పరిమాణ పరంగా 19.12% పెరుగుపడింది. 2020-21లో, భారతదేశం రూ. 43,720.98 కోట్ల (5,956.93 మిలియన్ డాలర్ల) విలువైన 11,49,510 మెట్రిక్ టన్నుల సముద్రపు ఆహారాన్ని ఎగుమతి చేసింది.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఓఖఇఆం) చైర్మన్ శ్రీ కె ఎన్ రాఘవన్ మాట్లాడుతూ, భారతదేశం తన ప్రధాన ఎగుమతి మార్కెట్లలో కోవిడ్ మహమ్మారి కారణాన సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, 13,69,264 మెట్రిక్ టన్నుల పరిమాణంతో 7.76 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగలిగింది.

శీతలీకరించిన రొయ్యలు పరిమాణం, విలువ పరంగా ప్రధాన ఎగుమతి వస్తువు. రూ. 42,706.04 కోట్లు 5,828.59 మిలియన్ డాలర్లు) ఆర్జించిన రొయ్యల ఎగుమతులు పరిమాణంలో 53.18 శాతం, మొత్తం విదేశీ మారక ఆదాయంలో 75.11 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ కాలంలో రొయ్యల ఎగుమతులు డాలర్ విలువలో 31.68 2021-22లో రొయ్యల మొత్తం ఎగుమతి 7,28,123 మెట్రిక్ టన్నులైతే అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా 3,42,572 మెట్రిక్ టన్నుల రొయ్యలను దిగుమతి చేసుకుంటుంది, చైనా (1,25,667 మెట్రిక్ టన్నుల), యూరోపియన్ యూనియన్ (90,549 మెట్రిక్ టన్నుల), సౌత్ ఈస్ట్ ఆసియా (44,683 మెట్రిక్ టన్నుల), జపాన్ (38,492 మెట్రిక్ టన్నుల), మధ్యప్రాచ్యం (37,158 మెట్రిక్ టన్నుల) గణాంకాలతో శీతలీకరించిన రొయ్యల ఎగుమతి విలువ ప్రకారం అన్ని మార్కెట్లలో పెరుగుదలను చూపింది.

వన్నామీ (వైట్ లెగ్) రొయ్యల ఎగుమతి 2021-22లో 5,15,907 మెట్రిక్ టన్నుల నుండి 6,43,037 మెట్రిక్ టన్నులకి పెరిగింది. డాలర్ విలువ పరంగా మొత్తం వన్నామీ రొయ్యల ఎగుమతులలో, అమెరికా 59.05% వాటాను కలిగి ఉంది, చైనా (14.59 %), యూరోపియన్ యూనియన్ (8.16 %), సౌత్ ఈస్ట్ ఆసియా (4.78 %), జపాన్ (3.61 %) , (3.17 %)తో మధ్య ప్రాచ్యం ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి. డాలర్ విలువ పరంగా 25.90% వాటాతో బ్లాక్ టైగర్ రొయ్యలకు అమెరికా ప్రధాన మార్కెట్‌గా మారింది, యూరోపియన్ యూనియన్ (23.78%) జపాన్ (22.71%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

రెండవ అతిపెద్ద ఎగుమతి వస్తువుగా సురిమి ఉత్పత్తులు, రూ. 3,979.99 కోట్లు (జూఆ 540.73 మిలియన్లు) పొందింది, పరిమాణంలో 12.96% మరియు డాలర్ ఆదాయంలో 6.97 %. ఇతర వస్తువుల ఎగుమతులు రూపాయి విలువలో 43.8% మరియు డాలర్ విలువలో 42.94% పెరిగాయి. ఇతర సముద్ర ఎగుమతుల్లో జూఆ పరంగా 56.55% వాటాతో సురిమి ఉత్పత్తులు ఉంటాయి.

మూడవ అతిపెద్ద ఎగుమతి వస్తువు శీతలీకరించిన చేపలు రూ. 3471.91 కోట్లు (471.45 మిలియన్ డాలర్లు) పరిమాణంలో 16.55 శాతం, డాలర్ ఆదాయంలో 6.08 శాతం. ఘనీభవించిన చేపల ఎగుమతి పరిమాణంలో 20.44% మరియు డాలర్ విలువలో 17.19% పెరుగుదల సాధ్యం అయ్యింది.

స్క్విడ్(కోమటి సంచులు అని పిలిచే జలచరం) ఎగుమతి, 75,750 మెట్రిక్ టన్నుల వద్ద నమోదైంది, పరిమాణంలో 23.82% మరియు డాలర్ పరంగా 40.24 శాతం వృద్ధిని చూపి,రూ. 2,806.09 కోట్లు (383.37 జూఆ మిలియన్లు) ఆర్జించింది.

నురుగు చేప (కటిల్ ఫిష్) ఎగుమతి, 58,992 మెట్రిక్ టన్నుల వద్ద నమోదైంది, రూపాయి విలువలో 26.83 % మరియు జూఆ విలువలో 26.18 % వృద్ధిని చూపి, రూ. 2062.63 కోట్లు (280.08 జూఆ మిలియన్లు) ఆర్జించింది.

ఎండు చేపల ఎగుమతి, 73,679 మెట్రిక్ టన్నుల వద్ద నమోదైంది, రూపాయి విలువలో 28.27 % వృద్ధిని చూపింది కానీ జూఆ విలువలో 8.59 % క్షీణించింది. రూ. 1472.98 కోట్లు (143.46 జూఆ మిలియన్లు) ఆర్జించింది.

ఆశాజనక రంగంగా పరిగణించే శీతలీకరించిన వస్తువుల ఎగుమతి కూడా పరిమాణం పరంగా 23.08 %, రూపాయి పరంగా 53.45 % పెరిగింది కానీ డాలర్ పరంగా 1.87 శాతం క్షీణించింది.

ప్రత్యక్ష వస్తువుల ఎగుమతి, 7,032 మెట్రిక్ టన్నుల వద్ద నమోదైంది, పరిమాణంలో 60.57%, రూపాయి విలువలో 47.43%, డాలర్ పరంగా 46.67% వృద్ధిని చూపింది.మొత్తం మీద శీతలీకరించిన రొయ్యలు, కటిల్ ఫిష్, స్క్విడ్, ఎండిన వస్తువులు, ఇతర వస్తువుల యూనిట్ విలువ వాస్తవ సానుకూల వృద్ధిని చూపింది.

విదేశీ మార్కెట్ల విషయానికొస్తే, అమెరికా 3371.66 మిలియన్ డాలర్ల దిగుమతివిలువతో భారతీయ మత్స్య ఉత్పత్తుల ప్రధాన దిగుమతిదారుగా కొనసాగింది, డాలర్ విలువ పరంగా 37.56 % వాటాను కలిగి ఎగుమతులు పరిమాణంలో 27.63 %, రూపాయి విలువలో 36.76 % డాలర్ ఆదాయాలలో 37.56 % వృద్ధిని నమోదు చేశాయి. ఘనీభవించిన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయిన ప్రధాన వస్తువుగా తన గత పరంపరను కొనసాగించింది, వన్నామీ రొయ్యల ఎగుమతులు పరిమాణంలో 26.81% మరియు డాలర్ పరంగా 34.65% వృద్ధిని కనబరిచాయి. అమెరికాకు బ్లాక్ టైగర్ రొయ్యల ఎగుమతులు పరిమాణం పరంగా 68.99% మరియు డాలర్ పరంగా 152.06% పెరిగాయి.

డాలర్లలో 1,175.05 మిలియన్ల విలువైన 2,66,989 మెట్రిక్ టన్నుల దిగుమతితో భారతదేశం నుండి చైనా రెండవ అతిపెద్ద సముద్ర ఆహార ఎగుమతి గమ్యస్థానంగా ఉద్భవించింది, పరిమాణంలో 19.50% డాలర్ పరంగా 15.14%. చైనా మార్కెట్‌కు ఎగుమతులు పరిమాణంలో 22.28%, రూపాయి విలువలో 31.09% డాలర్ విలువలో 25.12% పెరిగాయి. చైనాకు ఎగుమతి చేసే ప్రధాన వస్తువైన రొయ్యలు పరిమాణంలో 47.07% మరియు డాలర్ విలువలో 67.04% వాటాను కలిగి ఉండగా, చేప పరిమాణం పరంగా 32.10% మరియు మొత్తంలో విలువ పరంగా 15.19% వాటాను కలిగి ఉంది. చైనాకు ఎగుమతులలో రొయ్యలు పరిమాణంలో సానుకూల వృద్ధిని చూపించాయి.

ఎగుమతులలో ప్రధాన వస్తువు అయిన ఘనీభవించిన రొయ్యలతో భారతీయ సముద్ర ఆహారానికి యూరోపియన్ యూనియన్ మూడవ అతిపెద్ద గమ్యసానంగా కొనసాగింది, పరిమాణం డాలర్ విలువలో వరుసగా 29.11% మరియు 37.09% పెరుగుదల నమోదు చేసింది.

ఆగ్నేయాసియా నాల్గవ అతిపెద్ద మార్కెట్. ఘనీభవించిన రొయ్యలు, ఎగుమతులలో ప్రధాన వస్తువు, పరిమాణంలో 18.36% వాటా మరియు డాలర్ విలువ ద్వారా 36.81% 22.29% వృద్ధితో. ఘనీభవించిన చేప, పరిమాణంలో 33.42% వాటాతో,డాలర్ విలువ ద్వారా 21.42% 82.24% వృద్ధితో ఎగుమతులలో రెండవ ప్రధాన అంశంగా ఉంది.

డాలర్ విలువ పరంగా 5.68%, పరిమాణంలో 6.60% వాటాతో జపాన్ ఐదవ అతిపెద్ద దిగుమతిదారుగా కొనసాగింది, డాలర్ విలువలో 6.95 % వృద్ధిని నమోదు చేసింది. ఘనీభవించిన రొయ్యలు 74.55% % వాటాతో డాలర్ విలువలో 3.73% వృద్ధితో జపాన్‌కు ఎగుమతులలో ప్రధాన వస్తువుగా కొనసాగింది.

మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతులు పరిమాణంలో 20.2%, రూపాయిలో 21.27% డాలర్ పరంగా 20.7% వృద్ధిని చూపించాయి.

బోనమెత్తిన గోల్కొండ

– మంత్రులతో కలిసి అమ్మవారికి పట్టువ్రస్తాలు సమర్పించిన ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): గోల్కొండ కోట బోనమెత్తింది. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు గురువారం అంగరంగ వైభవంగా అంకురార్పణ జరిగింది. లంగర్‌హౌజ్ చౌరస్తా వద్ద మంత్రులతో పాటు రవిచంద్రకు ఘన స్వాగతం పలికారు. డప్పు దరువులు, పోతురాజు విన్యాసాలతో అతిథులను తోడ్కొని వెళ్లారు. అక్కడ బంగారు బోనానికి మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలతో కలిసి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దీపం వెలిగించి పూజలు నిర్వహించారు. తొట్టెలకు స్వాగతం పలికి, శ్రీ జగదాంబిక అమ్మవారికి పట్టువ్రస్తాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించేలా దీవించమని రవిచంద్ర అమ్మవారిని వేడుకున్నారు. ప్రజలంతా సుభిక్షంగా జీవించేలా ఆశీస్సులు ఇవ్వాలని వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభా రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ కమిటీ చైర్మన్ వావిలాల మహేశ్వర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

హైదరాబాద్, జూన్ 30:గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి మంగళవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్కెలగూడ, కండ్లకోయ, సుతారిగూడలో ఉన్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సొంత నిధులతో సమకూర్చిన నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దాతలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకొని, ఉన్నతంగా చదవాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, మేడ్చల్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరహరి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీలతాశ్రీనివాస్ రెడ్డి, రజితావెంకటేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ చావా సత్యనారాయణ జన్మదినం సందర్భంగా మంగళవారం మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు,

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు గద్దల సిరి

- అభినందించిన ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వి శాంత

ఖమ్మం, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలో మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని 'గద్దల సిరి' సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 విభాగం టేబుల్ టెన్నిస్ ఆటలో అత్యంత ప్రతిభ కనబర్చి మెడల్ సాధించడంతో రాష్ట్రస్థాయి టోర్నమెంట్లోకి ఎంపిక అనివార్యమయ్యింది. పిఈటి రోజా, ప్రోత్సాహం కోచ్ వివిఎస్ఎస్ మూర్తి, కృషి తల్లిదండ్రుల సహాయ సహకారాలతో తన ముందున్న లక్ష్యాన్ని సేదించగలిగానని విద్యార్థిని గద్దల సిరి, పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం వలన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. శాంత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు... గద్దల సిరికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ముందు ముందు మరిన్ని పథకాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ప్రతి మండలంలో గోడౌన్స్ నిర్మిస్తాం : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, జూన్ 30:రైతులు పండించిన ధాన్యాన్ని నిలువచేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలంలో కొత్తగా గిడ్డంగులను నిర్మించడానికి సన్నహాలు చేస్తుంది. పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిడ్డంగుల్లో నిల్వ చేస్తుందని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు.

కీసర మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో నూతన గిడ్డంగి (గోడౌన్) పనులకు గురువారం మంత్రి జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందన్నారు.

రైతుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. రైతాంగానికి రైతుబంధు కింద కోట్లాది రూపాయలను బ్యాంక్‌లో జమచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు.

నేడు తెలంగాణలో రైతులు సంతోషంగా జీవిస్తున్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర అసెంబ్లీలో బలపరీక్ష రద్దు..

ముంబై, జూన్ 30:సీఎం ఉద్ధవ్ ఠాక్రే తన పదవికి రాజీనామా చేయడంతో.. ఇవాళ మహారాష్ట్ర అసెంబ్లీలో జరగాల్సిన బలపరీక్షను రద్దు చేశారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని కూడా వాయిదా వేశారు. అసెంబ్లీ సెక్రటరీ రాజేంద్ర భగవత్ దీనిపై ఓ ప్రకటన చేశారు. గవర్నర్ ఆదేశాల ప్రకారం జరగాల్సిన బలపరీక్షను రద్దు చేసినట్లు ఎమ్మెల్యేలకు ఆయన తెలిపారు. వాస్తవానికి ఇవాళ సాయంత్రం లోగా ఉద్ధవ్ తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంది. కానీ బుధవారం ఆయన రాజీనామా చేయడంతో సీన్ రివర్స్ అయ్యింది. బలపరీక్ష ఆదేశాలను సవాల్ చేస్తూ శివసేన సుప్రీంను ఆశ్రయించగా.. కోర్టు ఆ పిటిషన్‌ను తిరస్కరించిన విషయం తెలిసిందే.

పోలీసుల జాబ్‌మేళాలో 986 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్, జూన్ 30: నిరుద్యోగులు జాబ్ మేళాల్లో ఉద్యోగాలు సంపాదించుకొని ఆర్థికంగా ఎదగాలని సెంట్రల్ జోన్ డీసీపీ రాజేశ్ చంద్ర సూచించారు. ఈ మేరకు బుధవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ సిటీ పోలీస్, సెంట్రల్ జోన్ ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో దాదాపు 22 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, 986 మందికి వివిధ కంపెనీలలో నియామకాలను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సెంట్రల్ జోన్ డీసీపీ రాజేశ్ చంద్ర ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం డీసీపీ రాజేశ్ చంద్ర, అదనపు డీసీపీ రమణారెడ్డిను ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎన్. మోహన్ రావు, డీఐ వెంకన్న, ఎస్ఐలు సురేందర్, స్వప్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులూ.. కృత్రిమ పరికరాలు అందుకోండి

హైదరాబాద్, జూన్ 30: దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవ పరికరాలను అందిస్తున్నామని, అవసరమైన వారందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. దివ్యాంగులకు, వయో వృద్ధులకు అవసరమయ్యే కృత్రిమ అవయవ పరికరాలను అందించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

ఇందులో భాగంగా బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని జీహెచ్ఎంసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అంగవైకల్యంతో బాధపడుతూ కృత్రిమ పరికరాలు అవసరమైన వారికి అలిమ్‌కో స్వచ్ఛంద సంస్థ సహకారంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పరికరాలు అందజేస్తామని తెలిపారు.



పదవ తరగతి ఫలితాల్లో కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాజన్న సిరిసిల్ల, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 10 వతరగతి పరీక్షల ఫలితాల్లో వేములవాడ కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జి శ్రీ మార్కండే - యులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి మణిదీపక్ 10 గ్రేడ్,బండ సరవు 9.8 పాయింట్స్, సాంధించిన వారికి అలాగే అత్యధిక రేటింగ్ సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ నరాల దేవేందర్,ప్రిన్సిపాల్ దరక్షన్ వ స ఫి యా,డైరక్టర్ పసీఉ ల్లా పుష్ప గుచ్ఛాలతో అభినందించి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలను కారణం ఉత్తమ బోధన కృత్యాలు, నిరంతర పర్యవేక్షణ, పిల్లల పట్టుదల, ఏకాగ్రత వలనే ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. ఈ సందర్భంగా ఫలితాల ప్రభంజనం సృష్టించిన ఉపాధ్యయులకు, విద్యార్థు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కిడ్స్ కాన్వెంట్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులైనట్టు వారు తెలిపారు

బెంగళూరులోని బాశ్ స్మార్ట్ కేంపస్ ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి వీడియో సందేశం మాధ్యమం ద్వారా ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 30: బాశ్ ఇండియా భారతదేశం లో అడుగుపెట్టి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భం లో, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఒక వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు.

ముందుగా, ప్రధాన మంత్రి బాశ్ ఇండియా ను భారతదేశం లో 100 ఏళు పూర్తి చేసుకొన్నందుకు అభినందించడం తో పాటు ఈ ప్రత్యేక సందర్భం భారతదేశ స్వాతంత్ర్యానికి 75వ సంవత్సరం లో చోటు చేసుకొంటోందన్నారు. ఇదే సందర్భం లో బాశ్ స్మార్ట్ కేంపస్ ను ప్రారంభిం చడమైంది. "ఈ కేంపస్ భారతదేశాని కి మరియు ప్రపంచాని కి భవిష్యత్తు కాలం లో కావలసిన ఉత్పత్తుల ను మరియు పరిష్కారాల ను రూపొందించడం లో తప్పక దారి ని చూపుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. బెంగళూరు లోని బాశ్ కేంద్రాన్ని 2015వ సంవత్సరం అక్టోబరు లో చాన్స్ లర్ మర్కెల్ గారి తో కలసి తాను సందర్శించడాన్ని కూడా ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చుకున్నారు.

నేటి కాలాన్ని సాంకేతిక విజ్ఞాన కాలం గా ప్రధాన మంత్రి అభివర్ణిస్తూ, మహమ్మారి చెలరేగినప్పుడు సాంకేతిక విజ్ఞాన ప్రయోజనాలు ఏ విధం గా వెలికివచ్చిందీ నొక్కిచెప్పారు. సాంకేతిక విజ్ఞానం లో, నూతన ఆవిష్కరణ లో మరిన్ని పెట్టుబడుల ను పెట్టడం ముఖ్యం అని ఆయన అన్నారు. నూతన ఆవిష్కరణ లు మరియు పరిమాణం పరం గా బాశ్ చేసిన కృషి ని ప్రధాన మంత్రి ప్రశంసిస్తూ, ఇది నిలకడ గా కొనసాగవలసిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. "భారతదేశం లో గడచిన 8 సంవత్సరాల లో సౌరశక్తి తాలూకు స్థాపిత సామర్థ్యం దాదాపు గా 20 రెట్ల మేర కు వృద్ధి చెందడం తో భారతదేశం యొక్క వృద్ధి హరిత ప్రాధాన్యం కలది గా రూపుదిద్దుకొంటోంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం లో, భారతదేశం వెలుపల కార్బన్-న్యూట్రాలిటీ ని సాధించినందుకు బాశ్ ను ప్రధాన మంత్రి కొనియాడారు.

ప్రస్తుతం భారతేదశం అత్యంత వేగం గా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల లో స్థానం సంపాదించుకొంది అని ప్రధాన మంత్రి అన్నారు. పెట్టుబడులు గత రెండేళ్ళ లో జోరందుకొన్నాయి. "మా యువత సౌజన్యం తో మా యొక్క స్టార్ట్-అప్ ఇకో-సిస్టమ్ ప్రపంచం లో అతిపెద్ద స్టార్ట్-అప్ ఇకో-సిస్టమ్ లలో ఒకటి గా నిలచింది. ఒక్క సాంకేతిక జగతి లోనే ఎన్నో అవకాశాలు ఉన్నాయి." భారత ప్రభుత్వం ప్రతి గ్రామాని కి అధిక వేగవంతమైన ఇంటర్ నెట్ ను అందించేందుకు కృషి చేస్తోంది. "డిజిటల్ ఇండియా తాలూకు మా దృష్టి కోణం లో ప్రభుత్వం లోని ప్రతి ఒక్క దశ ను సాంకేతిక విజ్ఞానం తో జత పరచడం అనేది ఒక భాగం గా ఉంది. ఈ అవకాశాల ను ప్రపంచం వినియోగించుకొని, మా దేశం లో పెట్టుబడి పెట్టాలని నేను కోరుతున్నాను" అని ప్రధాన మంత్రి అన్నారు.

ఈ ముఖ్య సందర్భం లో భారతదేశం లో మరింత ఎక్కువ గా పాటుపడడాన్ని గురించి ఆలోచించవలసిందంటూ బాశ్ కు ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు. "రాబోయే 25 సంవత్సరాల లో మీ జట్టు సభ్యులు మరేమి చేయగలుగుతారు అనే విషయం లో లక్ష్యాల ను నిర్దేశించుకోవలసింది. 100 సంవత్సరాల క్రితం ఒక జర్మన్ కంపెనీ గా భారతదేశాని కి బాశ్ తరలి వచ్చింది. అయితే, ఈ రోజు న అది ఒక జర్మన్ కంపెనీ అయినట్లే ఇండియన్ కంపెనీ గా కూడా ను ఉంది. జర్మన్ ఇంజినీరింగు కు, భారతదేశం యొక్క శక్తి కి ఇది ఒక గొప్ప ఉదాహరణ గా ఉంది. ఈ భాగస్వామ్యం ఇక ముందు సైతం బలవత్తరం గా వృద్ధి చెందుతూనే ఉంటుంది" అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

నూతన కలెక్టరేట్ భవననిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి - మంత్రి పువ్వాడ

- కొనసాగుతున్న నూతన కలెక్టరేట్ భావన నిర్మాణ పనులు

ఖమ్మం, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా నూతన కలెక్టరేట్ భవన సముదాయం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు

గురువారం జిల్లా కలెక్టర్ విపి గౌతం తో కలిసి వివి.పాలం గ్రామ సమీపంలో నిర్మితమవుతున్న నూతన కలెక్టరేట్ కార్యాలయ భవన సముదాయ నిర్మాణ పనుల పురోగతిని మంత్రి పువ్వాడ పరిశీలించారు.

భవన నిర్మాణం, ప్రాంగణానికి సంబందించిన పనులను పరిశీలిస్తూ, ప్లాన్ ప్రకారంగా పనులను కొనసాగుతున్నాయా లేదా అని పరిశీలించారు.

పౌర సేవల, పరిపాలనా సౌలభ్యం కోసమే నూతన కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని 44కోట్లతో 1,69,000వేల చ.అ.విస్తీర్ణంలో చేపడుతున్నట్లు మంత్రి వివరించారు.

ఇప్పటికే మెయిన్ బిల్డింగ్ స్లాబ్లు నిర్మాణ పనులు, సివిల్ పనులు పూర్తి అయినట్లు అధికారులు వివరించారు. అన్ని గదులలో ఇప్పటికే ఫ్లోరింగ్ పనులు సైతం పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. ఫినిషింగ్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

భవనం మొత్తం తిరిగి విద్యుత్ పనులు, ప్యాన్ల ఏర్పాటు, డ్రైనేజీ, నీటి సరఫరా, పార్కింగ్, టైల్స్ పనులు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భవన ప్రాంగణం ముందు భాగం మొత్తం చదును చేయాలని, చదును చేసిన అనంతరం నడక దారి, కాంపౌండ్ వాల్ చేపట్టాలని సూచించారు. భవన సముదాయం వెనక భాగంలో సీసీ రోడ్డు, పాత్ వే పనులను పరిశీలించారు. భవనం గోడకు ఆనుకొని పాట్ ప్లాంటింగ్ ఉండాలని, ఆ తర్వాత వరుసలో మొక్కలు ప్లాంటేషన్ చేసి, ప్లాంటేషన్ తర్వాత సీసీ రోడ్ చేపట్టాలన్నారు.

భవన సముదాయం మధ్యలో చేపట్టవల్సిన ప్లాంటింగ్, లాన్ పనులను సుందరంగా ఉండేలా చూడాలని అదేశించారు. అవసరమైనంత మేరకు కూలీల సంఖ్య పెంచి పనుల వేగం పెంచాలని సూచించారు.

వాహనాల పార్కింగ్, ఇతర పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తవుతున్న పనుల వివరాల నివేదికను అందివ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్, రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యానీప్రసాద్, తాసిల్దార్ నర్సింహారావు, ఏఎంసి చైర్మన్ లక్ష్మిప్రసన్న, కార్పొరేటర్లు కమర్తపు మురళి, వలరాజ్, నాయకులు ఆర్జేసీ కృష్ణ, అధికారులు తదితరులు ఉన్నారు.

టిఆర్ఎస్ బిజెపిల పోరాటం ఆరాటం మాక్స్ ఫిక్సింగ్‌లో భాగమే

- సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో టిఆర్ఎస్ బిజెపిల మధ్య తీవ్రమైన వైరుధ్యం ఉన్నట్లు పెద్ద ఎత్తున జరుగుతున్న విమర్శల వాడి వేడి దాడి మాక్స్ ఫిక్సింగ్ లో భాగమేనని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి తాను మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ద్విముఖ పోటీగా ఉన్న రాజకీయ వాతావరణాన్ని త్రిముఖ పోటీగా మార్చి టిఆర్ఎస్ లబ్ధి పొందేందుకే బిజెపి పై మ్యాచ్ ఫిక్సింగ్ పోరాటం చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రాల హక్కులు ఖనన చేసినప్పుడు నిరుద్యోగుల ఆకాంక్షల నెరవేర్చినపుడు బిజెపిపై టిఆర్ఎస్ చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రయోజనాలకే తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు కాదని ఆయన అన్నారు. కేసీఆర్ కూడా రాష్ట్రంలో సంక్షేమాన్ని అటకెక్కించారు. అని పెన్షన్లు డబల్ బెడ్ రూమ్ ఇల్లు రేషన్ కార్డు లాంటి పథకాలను వదిలివేసారని ఆయన అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ అతిగతి లేకుండా పోయిందని ఆయన వివరించారు. ఉదయపూర్ లో ముస్లిం తీవ్రవాదులు ఒక వ్యక్తిని అతి దారుణంగా చంపటం దుర్మార్గమని మతం పేరిట జరిగే మరణ హోమాన్ని నియంత్రించాలని ఆయన సూచించారు. ధరణి సమస్యలు ఇంకా రైతుల్ని పట్టిపీడిస్తున్నాయని ఆయన వివరించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ చనిపోయిన డివి కృష్ణ సంతాప సభలను ఈనెల 5వ తారీఖు వరకు రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహించాలని జూలై 15న రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే డివి కృష్ణ సంతాపసభకు వేలాదిగా తరలిరావాలని ఆయన సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ ప్రెస్ మీట్ లో జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి. రామయ్య, పుల్లయ్య, శివలింగం, బందెల వెంకయ్య, ఆవుల అశోక్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మొదటి బ్యాచ్ గ్రామ ఇంజనీర్లకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది- మోడల్‌ను ఇతర జిల్లాలకు అనుకరించాలి

న్యూఢిల్లీ, జూన్ 30: గ్రామీణ యువకుల సాధికారతతో ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప్ ప్రారంభమవుతుంది. ఆత్మనిర్భర్ భారత్‌కు వెళ్లే రహదారి ఆత్మనిర్భర్ గ్రామాల గుండా వెళుతుంది. స్థానికంగా ఉపాధి/స్వయం ఉపాధి మరియు వ్యవస్థాపకత వంటి కొత్త అవకాశాలను సృష్టించడం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి విశ్వాసం కలిగించే ఆంశమని నైపుణ్యాభివృద్ధి ఉ వ్యవస్థాపకత, ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద గిరిజన యువతకు రూరల్ ట్రైబల్ టెక్నికల్ ట్రైనింగ్ లేదా గ్రామీణ ఉద్యమి కార్యక్రమం భోపాల్ లోని రాజ్ భవన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈరోజు మధ్యప్రదేశ్ గవర్నర్ శ్రీ మంగూభాయ్ పటేల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో..గ్రామీణ ఇంజనీర్లుగా మారిన సుమారు 140 మంది గిరిజన యువకులకు స్కిల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. నైపుణ్య శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు మరియు "పాస్‌పోర్ట్ టు ప్రోస్పెరిటీ"గా పేర్కొన్న నైపుణ్యాలను సాధించినందుకు ట్రైనీలను ఆయన అభినందించారు.

పైలట్ ప్రాజెక్ట్‌పై తన సంతృప్తిని వ్యక్తం చేసిన మంత్రి.. పైలట్ ప్రోగ్రామ్ విజయం దేశంలోని ఇతర జిల్లాలకు ప్రతిబింబించేలా లాంచ్ ప్యాడ్‌ను అందజేస్తుందని చెప్పారు. ఇది స్థానికంగా అవకాశాలను అందుబాటులో ఉంచడం ద్వారా గిరిజన యువతకు సాధికారతను కల్పిస్తుందని తద్వారా వలసల నిర్మూల జరుగుతుందని తెలిపారు. ఇది స్వయం ప్రతిపత్తి లేదా ఆత్మనిర్భర్తపై దృష్టి సారించే ప్రభుత్వ కొత్త ఆర్థిక దృక్పథానికి అనుగుణంగా జిల్లాల్లో స్థానిక స్థాయిలో ఆర్థిక కార్యకలాపాలను ప్రేరేపిస్తుందని అన్నారాయన.

విద్యుత్ మరియు సౌరశక్తి, వ్యవసాయ యాంత్రీకరణ, ఇ-గవర్నెన్స్, ప్లంబింగ్ మరియు తాపీపని, ద్విచక్ర వాహనాల మరమ్మతు మరియు నిర్వహణ వంటి 5 విభాగాలలో లబ్ధిదారులకు ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షణ అందించబడింది. యువత తమ సొంత వ్యాపారాన్ని ప్రారంభించేలా ఈ శిక్షణ చేస్తుంది. తద్వారా ఇతర యువతకు కూడా ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మల్టీ స్కిల్లింగ్ మరియు నిరుద్యోగ యువతను విలేజ్ ఇంజనీర్లుగా మార్చడం అనే కాన్సెప్ట్ ఇతర జిల్లాల్లో కూడా పునరావృతమవుతుంది.

కోవిడ్ అనంతర కాలంలో నైపుణ్యం యొక్క ప్రాముఖ్యతను మంత్రి హైలైట్ చేశారు. కోవిడ్ మహమ్మారి భారతదేశంతో పాటు భారతీయులకు భారీ అవకాశాలను అందించే సాంప్రదాయ సరఫరా గొలుసులలో అంతరాయాలకు దారితీసిందని ఆయన అన్నారు. ప్రపంచం ఇప్పుడు విశ్వసనీయ భాగస్వామి కోసం వెతుకుతోంది. ప్రపంచం ఇప్పుడు భారతదేశం వైపు చూస్తున్నందున..గ్లోబల్ స్కిల్స్ హబ్‌గా ఎదగడానికి మన యువతకు నైపుణ్యం అవసరం. స్కిల్ ఇండియా 1.0 యొక్క లాభాలను పెంపొందించడానికి ఉ కోవిడ్ తర్వాత అభివృద్ధి చెందుతున్న న్యూ వరల్డ్ ఆర్డర్‌లో భారతదేశానికి అందించబడిన కొత్త ఆర్థిక అవకాశాలను ఉపయోగించుకోవడానికి నైపుణ్యం పట్ల ఒక కొత్త విధానాన్ని రూపొందించాలని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తమని ఆదేశించారని మంత్రి చెప్పారు.

భారతదేశంలోని 6 రాష్ట్రాలు - మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా నుండి ఎంపిక చేయబడిన 17 జిల్లాల్లోని 17 క్లస్టర్లలో 250 మంది లబ్ధిదారుల శిక్షణ కోసం సంసదియ సంకుల్ పరియోజన కింద పైలట్ ప్రాజెక్ట్ 13 మే 2022న ప్రారంభించబడింది. మధ్యప్రదేశ్ సీఎం శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఎంఓఎస్ రాజీవ్ చంద్రశేఖర్, శ్రీ బీఎల్ సంతోష్ ఇతర ప్రముఖుల సమక్షంలో దీనిని ప్రారంభించారు.

గ్రామీణ యువతకు మరిన్ని అవకాశాలను అందించడానికి అలాగే స్థానిక గ్రామ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నైపుణ్యానికి ఒక ముఖ్యమైన అంశంగా ప్రాధాన్యత ఇస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి 700 జిల్లాలకు జిల్లా నైపుణ్య ప్రణాళికలను రూపొందిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మహాత్మా గాంధీ నేషనల్ ఫెలోను నియమించింది. వారు స్థానిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను రూపొందించడంలో జిల్లా ప్రజా ప్రతినిధిగా స్థానిక జిల్లా కలెక్టర్‌తో కలిసి పని చేస్తారు. స్థానికంగా ఏ రకమైన నైపుణ్యాలు అవసరం, అక్కడ ఏ రకమైన అవకాశాలు ఉన్నాయి మరియు రాష్ట్రంలో మరియు దేశంలోని స్థానిక సంఘం వెలుపల నైపుణ్యాల కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే ఆంశాల ఆధారంగా దీనిని వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మరియు వ్యవసాయేతర ఆర్థిక వ్యవస్థగా విభజించారు.

పది ఫలితాల్లో ట్రినిటీ హవా- 59 మందికి 10 జీపీఏ

కరీంనగర్ , జూన్ 30(నేటినిజం ప్రతినిధి): పదవ తరగతి ఫలితాల్లో ట్రినిటీ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం సైతం పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో 10 జీపీఏ సాధించారు. గురువారం ప్రకటించిన ఫలితాల్లో ట్రినీటి పాఠశాలకు చెందిన 59 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు. పాఠశాలకు చెందిన 56 మంది విద్యార్థులు 9.8 జిపిఏ సాధించగా 47 మంది విద్యార్థులు 9.7 మరో 40 మంది విద్యార్థులు 9.5 జిపిఏ సాధించడం విశేషం. ఫలితాల అనంతరం ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పదవ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం పాఠశాల సత్తా తెలియజేస్తుందన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాల అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా తినిటి విద్యాసంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు అందుకు విద్యార్థులను సిద్ధం చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. 10 జిపిఏ సాధించిన విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అభినందించారు.

కుప్పం అభ్యర్థిపై క్లారిటీ ఇచ్చిన మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి, జూన్ 30: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం అభ్యర్థిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా పలమనేరు నుంచి తమ పార్టీ అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది కూడా ఆయన స్పష్టం చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి మరోసారి అధికారం అప్పగించాలని ఆయన కోరారు. చిత్తూరు జిల్లా పలమనేరులో వైఎస్సార్‌సీపీ ప్లీనరీ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికల హామీలను 95 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. కరోనా సమయంలో ప్రతి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారని గుర్తు చేశారు. వేల కోట్లు వెచ్చించి ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన విషయాలేవీ చంద్రబాబుకు కనిపించడం లేదని దుయ్యబట్టారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఇంగ్లిష్ మీడియం విద్యను తీసుకొచ్చారని, తద్వారా విద్యార్థులు



పోరాట యోధులు



ప్రస్తావన:

గడచిన 2 సంత్సరాల కాలం కరోనా భూతం (కోవిడ్-19) జనంపై విరుచుకుపడి యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసి వేలు, లక్షల ప్రజల ప్రాణాలను హరించివేసిన వైనం. గుర్తుకువస్తే భయం... భయం... నేటికీ ఎక్కడ ఒకచోట నాలుగో వేవ్ రూపంలో కరోనా భూతం వెంటాడుతూనే ఉంది. ఇంతటి భయానక వాతావరణాన్ని తరిమి తరిమి కొట్టిన పోరాట యోధులు, ప్రాణదాతలు ఎవరు? ఇంకెవరు? "డాక్టర్లు" వారే ఏ విభాగానికి చెందిన వారైనప్పటికీ, ఆ సమయంలో కుటుంబాన్ని వదిలి ప్రాణాలను సైతం పణంగా పెట్టి, పగలనక, రాత్రనక ఆహార్నిశలు యమునితో పోరాటం చేసి ప్రజల ప్రాణాలను నిలబెట్టిన ఘనులు డాక్టర్లు. భారతదేశానికి చెందిన డాక్టర్లు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలందించిన అత్యవసర అధికారాలు, విధులు నేపథ్యం, ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశం డాక్టర్లు మరణాల రేటుని తగ్గించగలిగారన్నది సత్యం. ఈ విధంగా నిరంతరం డాక్టర్లు కొనసాగిస్తున్న సేవాతత్పరతకు అక్కడక్కడ కొన్ని సందర్భాల్లో అపశృతులున్నప్పటికీ పోరాటయోధులు, ప్రాణదాతలు డాక్టర్లే. ఈ సందర్భంగా చరిత్రలోకి వెళ్లితే....

చరిత్ర:

భారతదేశం జాతీయ వైద్యుల దినోత్సవం జూలై 1న, ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ రెండొవ ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జన్మదినమును గుర్తుచేసుకుంటూ ప్రతియేట సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు విధులు నిర్వహించిన వీరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ & మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటులో కీలకపాత్ర పోషించడం గమనార్హం. డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్యులుగానే కాకుండా విద్యావేత్త, పరోపకారి, సామాజిక కార్యకర్త కావడం, ఇంకా వారు వైద్యసేవను ఆదర్శవంతంగా తీసుకోవడానికి కారణం, డాక్టర్లు ఒత్తిడితో కూడిన సేవా జీవితానికి తమ జీవితాలను అంకితం చేసిన లక్షలాది మంది వైద్యులకు ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతూ, డాక్టర్లు గౌరవప్రదంగా, దయతో ఉండాలనీ అంటుండేవారు. బ్రిటిష్ మెడికల్ జర్నల్ డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ సంస్మరణలో వారి గురించి 'భారత్ ఉపఖండంలో మొదటి వైద్య సలహాదారు, అనేక రంగాలలో వీరు తన సమకాలీనులను అధిగమించారనీ పేర్కొనడం గమనార్హం. డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వృత్తిపరంగా అత్యున్నత స్థితిలో ప్రపంచంలోనే అతి పెద్ద కన్సల్టింగ్ ప్రాక్టీస్‌ని కలిగివున్నట్లు, నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించడంలో ఘనులు. పేద ప్రజలకు అందుబాటులో ఉండేవారట. దేశంలో రెండు ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థల ఏర్పాటుకు కీలక పాత్రను పోషించారు.

1928లో ఇండియన్ మెడికల్ అసోషియేషన్, 1939 & 1945 మధ్యలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మొదటి అధ్యక్షుడిగా ఉన్నారు. ఇంకా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, ఇన్ఫెక్షియస్ డిసీత్ హాస్పిటల్ కలకత్తాలో మొట్టమొదటి పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కాలేజీని స్థాపించడానికి తోడ్పడ్డారు. డాక్టర్ వృత్తికి వన్నె తెచ్చిన వీరి ఘనకీర్తిని కొనియాడుతూ, ఇంకా డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ స్వాతంత్ర్య సమరయోధులు కూడా, డాక్టరుగా వైద్యవృత్తికి వీరు తెచ్చిన కీర్తి ప్రతిష్టలను, సేవాభావాన్ని గుర్తించిన భారతదేశం జూలై 1వ తేదిని ప్రతి సంవత్సరం డాక్టర్స్ డే - జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవడం పరిపాటి. డాక్టర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వారందరికీ డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ మార్గదర్శకులు. డాక్టర్ వృత్తిపట్ల ఉండాల్సిన అంకిత భావాన్ని భవిష్యత్ తరాల డాక్టర్లందరికీ వృత్తి ధర్మంకి, ఉన్నతవిలువలను తెలియపరిచే విధంగా ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

ముగింపు:

డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ డాక్టర్ వృత్తి పట్ల ఉండాల్సిన అంకిత భావం, భవిష్యత్ తరాల డాక్టర్లందరికీ స్ఫూర్తివంతం కావడానికి 1982 జూలై 1వ తేదీని డాక్టర్స్‌డేగా ఉత్సవాలు జరుపుకుంటూ వైద్యవృత్తికి సేవా భావంతో విధులను నిర్వర్తించిన డాక్టర్లను సన్మానించుకుంటూ, ఇతర డాక్టర్లకు స్ఫూర్తి కలిగిస్తూండటం గమనార్హం. వైద్యవృత్తికి మార్గదర్శకులైన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ 1982 జూలై 1వ తేదినే మరణించడం విశేషంగా పేర్కొనవచ్చు.

కనుక ఈ తేదీని డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్లందరికీ వందనాలు-హరి చందనాలు.

సర్వేజనాః సుఖినోభవంతు.

జూలై 1న, జాతీయ వైద్యుల దినోత్సవం

-శారద శృంగేరి
9490261119

ధరణిపై 1న కీలక భేటీ.. వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించనున్న సీఎస్

హైదరాబాద్, జూన్ 30: ధరణిలో మరింత సౌలభ్యత దిశగా ప్రభుత్వం దృష్టిసారించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జూలై 1న అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎస్ సోమేష్‌కుమార్ వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ అయ్యాయి. సమస్యలపై సమగ్ర సమాచారం కోరుతూ ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని సమాచారం పంపారు. భూ యాజమాన్య హక్కుల కల్పన, వివాదాలు రెవెన్యూ శాఖ పరిధినుంచి, భూ సమస్యల పరిష్కారం అంతా కలెక్టర్ల చేతుల్లోకి చేరింది. గ్రీవెన్స్‌లను మీ సేవ, వాట్సాప్, మెయిల్‌లలో ప్రజలు కలెక్టర్లకు పంపిస్తూ వాటి పరిష్కారం కోసం వేచి చూస్తున్నారు. ధరణి పోర్టల్‌తో అనేక రకాల సమస్యలు నెలకొన్నాయి. వాటిని పరిష్కరించే యంత్రాంగం కలెక్టర్లేనని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. అచ్చుతప్పులు, యాజమాన్య హక్కులు మారినా పాత యజమానుల పేర్లే రికార్డుల్లో చేర్చడం, అవే ఆన్‌లైన్‌లో కనిపించడం సాధారణమైంది. కులం, లింగ తేడాలు, సర్వే నెంబర్ల తప్పులు, ఊర్ల పేర్లు తప్పులు, విస్తీర్ణం ఎక్కువ తక్కువల వంటి అనేక లోపాలు తీరడంలేదు.

ధరణి సమస్యలను నివారించి మరింత సౌకర్యవంతంగా రైతాంగానికి మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ తాజాగా సీఎస్‌కు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు సీసీఎల్ఏ కార్యాలయం కలెక్టర్లకు సమాచారం అందించింది. జిల్లా, మండలా, గ్రామం, సర్వే నెంబర్, ప్రభావిత విస్తీర్ణం, ఎందరు రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు? సమస్య, పరిష్కారం వంటి వివరాలతో కూడిన ప్రొఫార్మా కలెక్టర్లకు చేరింది. వీటిపై వచ్చే నెల 1న చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

బుధవారం హనుమాన్ సెంట్రింగ్ అసోసియేషన్ యూనియన్ ఆఫీస్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గారు & యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ముఠా జై సింహాగారు ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో చైర్మన్ పి.అశోక్, టీఆర్ఎస్ నాయకులు ఎస్.టి.ప్రేమ్, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు

పీఎంఏవై -జి గృహాన్ని ప్రారంభించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, జూన్ 30: రాజేంద్రనగర్ లో ఉన్న జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీ అండ్ పీఆర్) లోని రూరల్ టెక్నాలజీ పార్క్ (ఆర్ టీ పి)లో నిర్మించిన నమూనా పీఎంఏవై -జి గృహాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన శ్రీ గిరిరాజ్ సింగ్ అందరికీ అందుబాటులో విధంగా తక్కువ ఖర్చుతో పర్యావరణహిత గృహాలను నిర్మించడానికి అందుబాటులో ఉన్న సాంకేతికతను రూరల్ టెక్నాలజీ పార్క్ (ఆర్ టీ పి)లో నిర్మించిన నమూనా పీఎంఏవై -జి గృహం ప్రదర్శిస్తుందని అన్నారు. గృహ నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానంతో పీఎంఏవై -జి పథకం కింద గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపడతామని మంత్రి వివరించారు. అందరికీ గృహ వసతి కల్పించాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ (పీఎంఏవై -జి) కింద గ్రామీణ గృహ నిర్మాణ పనుల్ని ప్రారంభించిందని మంత్రి తెలిపారు.

మోడల్ హౌస్ లో కల్పించిన వివిధ సౌకర్యాలు, నిర్మాణంలో ఉపయోగించిన నిర్మాణ సాంకేతిక అంశాలు, నాణ్యతతో రాజీ పడకుండా పక్కా గృహ ప్రమాణాలతో తక్కువ ఖర్చుతో నిర్మాణం పూర్తి చేయడానికి గల అవకాశాలను శ్రీ గిరిరాజ్ సింగ్ వివరించారు.

గృహ అవసరాలు,వంట కోసం అవసరమైన ఇంధనాన్ని సౌరశక్తి ద్వారా సరఫరా చేసేందుకు ఇంటి పై కప్పుపై నెట్ మీటరింగ్ సౌకర్యంతో ఆన్ గ్రిడ్ 2 కేడబ్ల్యు సౌర యూనిట్ ను నెలకొల్పడం జరిగిందని మంత్రి వివరించారు. ఆర్ టీ పి కంప్రెస్డ్ మడ్ బ్లాక్ ప్రొడక్షన్ యూనిట్‌ని సందర్శించిన కేంద్ర మంత్రి ఇందులో ఉన్న ప్రక్రియ, నాణ్యత మరియు ఉత్పత్తి వ్యయానికి సంబంధించిన వివరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో పర్యావరణ అనుకూలమైన ఇటుకలను తయారు చేయడంలో ఎక్కువ ఫ్లై-యాష్‌ని ఉపయోగించాలని మంత్రి సూచించారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా విధంగా ఖర్చు తగ్గించడానికి మట్టితో వివిధ నిప్పత్తులలో ఫ్లై-యాష్ కలపడానికి నూతన విధానానికి రూపకల్పన చేయాలని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ అధికారులకు మంత్రి సూచించారు.

జాతీయ గ్రామీణాభివృద్ధి,పంచాయతీ రాజ్ సంస్థలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నాగేంద్ర కుమార్ వివరించారు. దేశంలో పంచాయతీల సామర్థ్య పెంపుదల కోసం జాతీయ గ్రామీణాభివృద్ధి,పంచాయతీ రాజ్ సంస్థ సహకారం అందిస్తున్నదని తెలిపారు. 342 చదరపు అడుగుల విస్తీర్ణంలో (హాల్,బెడ్ రూమ్, వంటగది, మరుగుదొడ్డి, బాత్ రూంతో కలిపి) సింగల్ బెడ్ రూం మోడల్ హౌస్ నిర్మాణం జరిగింది. గృహం పునాది కోసం రాండమ్ రబుల్ స్టోన్ మేసన్రీ, గోడలను నిర్మించేందుకు ఫ్లై-యాష్ ఇటుకలతో రాట్ -ట్రాప్ సాంకేతికతను ఉపయోగించారు.

తెలంగాణలోని రాజేంద్రనగర్ లో ఉన్న జాతీయ గ్రామీణాభివృద్ధి,పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీ పీఆర్) లోని రూరల్ టెక్నాలజీ పార్క్ (ఆర్ టీ పి)లో నిర్మించిన నమూనా పీఎంఏవై -జి గృహాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్

ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జాతీయ గ్రామీణాభివృద్ధి,పంచాయతీ రాజ్ సంస్థ , నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, ఎంఎస్ఎంఈ ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఎంఎస్ఎంఈ రంగంలోని నిరుద్యోగ యువత, స్వయం సహాయక బృందాల సభ్యులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను అందించడం మరియు ఆవిష్కరణలు మరియు రూపకల్పనకు సహకారం అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుంది.

ప్రశాంతంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ఖమ్మం, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్, వ్యవసాయ పాలిటెక్నిక్ లలో ప్రవేశాల కొరకు నిర్వహించే

-జిల్లా సమన్వయకర్త బి రాజగోపాల్

ప్రవేశపరీక్ష పాలిసెట్ 2022 గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తొమ్మిది పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా నిర్వహించబడిందని జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.రాజగోపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కోవిడ్-19 నిబంధనలను పూర్తిగా అమలు పరిచామన్నారు.

అభ్యర్థులను థర్మల్ స్క్రీనింగ్ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమతించామన్నారు. పరీక్ష కేంద్రాలను మున్సిపల్ సిబ్బంది పూర్తిగా సానిటైజ్ చేసారని తెలిపారు. వైద్య శాఖ పరీక్ష కేంద్రాల వద్ద సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు.పాలిసెట్ కు మొత్తం 1934 మంది అభ్యర్థులకు గాను 1814 మంది హాజరైనట్లు తెలిపారు.

బాలురలో 915 మందికిగాను 866 మంది హాజరైయ్యారని పేర్కొన్నారు. బాలికలలో 1019 మందిఅభ్యర్థులకుగాను 948 మంది హాజరైయ్యారన్నారు. ఈ సందర్భంగాజిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బి. రాజగోపాల్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జె. రవి కుమార్, సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక పరిశీలకులు బి. రమణ నాయక్, రెవెన్యూ, పోలీస్, విద్యా శాఖల ప్రత్యేక తనిఖీ అధికారులు మనోజ్ కుమార్, బి. మారుతి, యం. రఘుపతిలు జిల్లా లోని అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

ఎస్బీఐలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం.. ఫిర్యాదుల వెల్లువ

న్యూఢిల్లీ, జూన్ 30: కేంద్ర ప్రభుత్వ రంగ బ్యాంక్.. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం నుంచి దేశవ్యాప్తంగా బ్యాంక్ సేవల్లో అంతరాయం ఏర్పడిందని కస్టమర్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. నెట్ బ్యాంకింగ్, నిధుల బదిలీ, ఆన్ లైన్ ట్రాన్సాక్షన్ల విషయమై సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బ్యాంక్ కస్టమర్లు ఫిర్యాదు చేస్తున్నారు. యూపీఐ చెల్లింపుల విషయంలో ఈ సమస్య తలెత్తినట్లు చెబుతున్నారు.

చివరకు ఎస్బీఐ ఏటీఎంలలోనూ నగదు విత్‌డ్రాయల్స్ జరుగడం లేదని అంటున్నారు. ఎస్బీఐ ఖాతాదారులు తమ యోనో యాప్ ఓపెన్ చేయడానికి ప్రయత్నించినప్పుడు బ్యాంకులో మెయింటెనెన్స్ పనుల వల్ల కస్టమర్లకు సేవలు అందించడంలో అంతరాయం ఏర్పడిందని మెసేజ్ వస్తున్నది. నెలాఖరులో వేతన జీవుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు పడే వేళ అంతరాయం ఏర్పడటం పట్ల బ్యాంక్ ఖాతాదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి బ్యాంకింగ్ సేవల గురించి ఎస్బీఐ కస్టమర్లు ఫిర్యాదు చేస్తున్నట్లు డౌన్ డిటెక్టర్ తెలిపింది. కస్టమర్లకు బ్యాంకింగ్ సేవల పునరుద్ధరణపై ఎస్బీఐ ఇంకా స్పందించలేదు.

దోస్త్ నోటిఫికేషన్ విడుదల.. నేటి నుంచి రిజిస్ట్రేషన్

హైదరాబాద్, జూన్ 30: తెలంగాణలోని ఏడు ప్రధాన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. జులై1 నుంచి 30 వరకు మొదటి విడత దోస్త్ రిజిస్ట్రేషన్‌లకు అవకాశం కల్పించారు. జులై 6 నుంచి 30 వవరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఆగస్టు 6న మొదటి విడత రిజిస్ట్రేషన్లకు సంబంధించి డిగ్రీ సీట్లను కేటాయించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1080 డిగ్రీ కాలేజీలు ఉండగా దోస్త్ పరిధిలోనివి 962 ఉన్నాయి. మిగతా కాలేజీలు9 దోస్త్ పరిధిలో లేవు. ఈ కాలేజీల్లో మొత్తం 4,68,870 సీట్లు ఉన్నాయి. వీటిని మూడు విడతల్లో భర్తీ చేయనున్నారు. అయితే గతేడాది మాత్రం 2,55,021 సీట్లు భర్తీ అయ్యాయి.

ఆగస్టు 7 నుంచి 18 వరకు మొదటి విడత సీట్ల కేటాయింపు విద్యార్థులకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. ఆగస్టు 7 నుంచి 21వ తేదీ వరకు రెండో విడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. అదే నెల 7 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చు. 28 ఆగస్టున సాయంత్రం రెండో విడుతకు సంబంధించిన సీట్లను కేటాయించను న్నారు.

ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీర్నపల్లిలో మండల, జిల్లా పరిషత్ స్కూల్స్, అంగన్ వాడి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన బోయినపల్లి వినోద్ కుమార్

-రూ. 5 కోట్ల వ్యయం చేయనున్న ప్రతిమ ఫౌండేషన్

రాజన్న సిరిసిల్ల, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లా వీర్నవల్లి మండల కేంద్రంలో నిర్మించనున్న ప్రతిమ ఫౌండేషన్ 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మండల పరిషత్ జిల్లా పరిషత్ అంగన్వాడి నూతన భవనాల నిర్మాణం పనులకు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ శంకుస్థాపన

చేశారు.గురువారం వీర్నపల్లి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగిన ఈ శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వీర్నపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ తాను కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న సమయంలో సంసద్ ఆదర్శ యోజన కింద వీర్నపల్లిని దత్తత తీసుకున్నానని, అందులో భాగంగా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టానని, భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలను చేస్తామని అన్నారు.ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో వీర్నపల్లిలో మండల, జిల్లా పరిషత్ స్కూల్స్, అంగన్వాడి నూతన భవనాల నిర్మాణం కోసం ఈ రోజు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వినోద్ కుమార్ తెలిపారు.అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలలో రాజకీయాలకు ఎలాంటి తావు లేదని ఆయన స్పష్టం చేశారు.ప్రతిమ ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ హరిణి మాట్లాడుతూ ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటి మాస్కులను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ నాలుగు కేంద్రాలను నిర్వహిస్తున్నామని, యువతలో స్కిల్స్ ను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు డాక్టర్ హరిణి పేర్కొన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను కూడా నిర్వహిస్తున్నామని, అందుకోసం ప్రత్యేకంగా అన్ని వసతులతో కూడిన వోల్వో బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ చైర్పర్సన్ అరుణ, కే డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్రావు, టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్ పి టి సి, తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం..

-మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి

ఖమ్మం, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన గురువారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా గౌరవ చైర్ పర్సన్ అధ్యక్షతన 2 ఎజెండా అంశాలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులతో చర్చించి 2 ఎజెండా అంశాలను ఆమోదించడం జరిగిందని అన్నారు. అలాగే మనకు వచ్చిన టీయూఎఫ్టీసీ నిధులు 20 కోట్ల రూపాయలలో ప్రతి వార్డుకు విలీన గ్రామాలకు 50 లక్షల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. అలాగే పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి పాలకవర్గ సభ్యులతో చర్చించడం జరిగిందని, వర్షాకాలం వచ్చినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వేములవాడ పట్టణ అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలకవర్గం పనిచేస్తుందని అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయకుండా, నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, ఏఈ నరసింహస్వామి, పాలకవర్గ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న ఉచిత వాటర్ ప్లాంట్

శుద్ధజలంతో ప్రజా ఆరోగ్యం క్షేమం ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని వికాస్ రావు

రాజన్న సిరిసిల్ల, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ, జూన్ 30: వేములవాడ పట్టణంలో శుక్రవారం ప్రతిమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రజక సంఘం వారు, చుట్టూ పక్కన గల ప్రజలు మంచి నీటి సమస్య గురించి ఫౌండషన్ చినార్మన్ చెన్నమనేని వికాస్ దృష్టికి తీసుకరావడం జరిగింది. వారి అభ్యర్థనకు స్పందించి ఉచిత మంచి నీటి శుద్ధ జల కేంద్రంని డోనేట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పడేఅనేక రకాల జబ్బులకు కలుషిత నీరే కారణం అని, త్రాగే నీరు శుద్ధ జలమై ఉంటే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంట్టారన్నారు.

ఈ ప్రారంభోత్సవం కు అందరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంబేద్కరిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుంకర రవి శంకర్ జన్మదిన శుభాకాంక్షలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): చొప్పదండి నియోజకవర్గంఎమ్మెల్యే సుంకర రవి శంకర్ జన్మదినం సందర్భంగా జిల్లా అంబేద్కరిస్ట్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఆయననుమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాఅధ్యక్షులు బొల్లం దేవరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ నుశాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. అనంతరం సుంకె రవిశంకర్ కుజన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఎస్సీ ఫలితాలలో కృష్ణవేణి పాఠశాల ప్రభంజనం

రాజన్న సిరిసిల్ల, జూన్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గురువారం విడుదలైన ఎస్సెస్సీ ఫలితాలలో విజయ కేతనం ఎగురవేసింది. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అబ్బరబండ హిమేష్ 10/10,వంగీ కౌశిక్ వినయ్ 10/10, ముగ్గురు విద్యార్థులుదారం సునీత, వాసం వినిల, సోమినేని క్రిష్ణతేజ, శ్రీకళ 9.8/10, తొమ్మిది మంది విద్యార్థులు 9.7/10, ఏడుగురు విద్యార్థులు 9.3 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా క్రిష్ణవేణి పాఠశాల యాజమాన్యం, పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ విద్యార్థులను అభినందించారు.

నెక్సస్ హైదరాబాద్ వద్ద 60కు పైగా బ్రాండ్లపై ఫ్లాట్ 50 % తగ్గింపు

హైదరాబాద్, జూన్ 30: హైదరాబాద్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన షాపింగ్ కేంద్రం నెక్సస్ హైదరాబాద్ అత్యంత ఆసక్తిగా నగరవాసులు ఎదురుచూస్తోన్న ఫ్లాట్ 50% తగ్గింపును జూలై 1?2?3 తేదీలలో అందిస్తున్నట్లు వెల్లడించింది.

భారతదేశంలో అతిపెద్ద రిటైల్ ప్లాట్‌ఫామ్ నెక్సస్ మాల్స్ భారతదేశవ్యాప్తంగా 13 నగరాలలో 17 మాల్స్‌ను కలిగి ఉంది. షాపర్లకు వినూత్నమైన అనుభవాలను ఇది అందిస్తుంది. ప్రతి రోజూ కొత్తగా అంటూ వినియోగదారులకు నూతన, వినూత్న అనుభవాలను తీసుకువస్తామనే వాగ్దానం చేస్తుంది.

కరోనా మహమ్మారి అనంతర కాలంలో వ్యాపారం తిరిగి సాధారణ